తెలంగాణ
TELANGANA MUCHATLU
ముచ్చట్లు
TELTEL/2023/88710
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక
వరంగల్ | ఆదివారం - 23- ఆగస్టు 2026 | సంపుటి : 4 | సంచిక : 80 | పేజీలు - 8 | వెల : రూ 7 | www.telanganamuchatlu.in



# తెలంగాణ-లివర్‌పూల్ వ్యూహాత్మక భాగస్వామ్యం

- లండన్‌లో ముఖ్యమంత్రితో కీలక భేటీ
- జీవశాస్త్ర, సాంకేతిక రంగాలపై దృష్టి
- క్రీడలు, సృజనాత్మక ఆర్థిక వ్యవస్థలో సహకారం
- అక్టోబరులో హైదరాబాద్‌కు ప్రతినిధి బృందం

లండన్, ఆగస్టు 22 (తెలంగాణ ముచ్చట్లు):

తెలంగాణతో వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని ఏర్పరచుకునేందుకు బ్రిటన్‌లోని లివర్‌పూల్ నగరం ఆసక్తి వ్యక్తం చేసింది. ఈ మేరకు లివర్‌పూల్ నగర అభివృద్ధి విభాగ కార్పొరేట్ డైరెక్టర్లు సుసాన్ ఫిన్నెగన్, నువాలా గల్లాఘర్ తమ సహచరులతో కలిసి లండన్‌లో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిశారు. ఈ సమావేశంలో రెండు ప్రాంతాల మధ్య భవిష్యత్ సహకార అవకాశాలపై విస్తృతంగా చర్చించినట్లు సమాచారం. సమావేశంలో జీవశాస్త్ర పరిశ్రమలు, సాంకేతిక రంగం, క్రీడలు, సృజనాత్మక ఆర్థిక వ్యవస్థ వంటి కీలక రంగాల్లో పరస్పర భాగస్వామ్యంపై చర్చ జరిగింది.
తెలంగాణలో వేగంగా అభివృద్ధి చెందుతున్న పారిశ్రామిక, సాంకేతిక వాతావరణం లివర్‌పూల్ ప్రతినిధులను ఆకట్టుకున్నట్లు అధికారులు తెలిపారు. రెండు ప్రాంతాల మధ్య పెట్టుబడులు, నైపుణ్యాల మార్పిడి, సంయుక్త కార్యక్రమాల అమలుకు అవకాశాలను పరిశీలించారు.
జీవశాస్త్ర రంగంలో పరిశోధనలు, వైద్య సాంకేతికత, ఔషధ తయారీ వంటి అంశాల్లో

మిగతా 2లో

# పెండింగ్ దరఖాస్తులపై మంత్రి ఆగ్రహం

- భూభారతి అర్జీల పరిష్కారానికి గడువు
- ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి వేగం
- నిజామాబాద్‌లో టవర్స్‌కు స్థల పరిశీలన
- ఇబ్బందులు కలిగిస్తే చర్యలు




నిజామాబాద్, ఆగస్టు 22 (తెలంగాణ ముచ్చట్లు):

రాష్ట్రంలో భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపించాలనే లక్ష్యంతో ప్రభుత్వం చేపట్టిన భూ రీసర్వే ప్రక్రియను వేగవంతం చేయాలని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అధికారులను ఆదేశించారు. శనివారం ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో విస్తృతంగా పర్యటించిన మంత్రి పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. నాగారంలోని నిర్మితి కేంద్రంలో ప్రతిపాదిత ఇందిరమ్మ హౌసింగ్ టవర్స్ కోసం స్థలాన్ని పరిశీలించడంతో పాటు పాముల బస్తీలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులతో ముఖాముఖి నిర్వహించారు. అనంతరం డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల లబ్ధిదారులకు కేటాయింపు పత్రాలను అందజేశారు. తరువాత కలెక్టరేట్‌లో నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల రెవెన్యూ, హౌసింగ్, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్, సర్వే శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించి పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. సమీక్ష సమావేశంలో మంత్రి మాట్లాడుతూ ప్రజల సమస్యల పరిష్కారంలో జాప్యం చేసే అధికారులను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని హెచ్చరించారు.

మిగతా 2లో



# గిరిజన విద్యార్థుల అభ్యున్నతే ప్రభుత్వ ధ్యేయం

- ఉట్నూరు ఆశ్రమ పాఠశాలలో మంత్రి అడ్లూరి పర్యటన
- నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన వసతులపై దృష్టి
- ఖాళీ పోస్టుల భర్తీ, సిబ్బంది సమస్యల పరిష్కారానికి హామీ
- విద్యార్థులతో సహపంక్తి భోజనం చేసిన మంత్రి

ఉట్నూరు, ఆగస్టు 22 (తెలంగాణ ముచ్చట్లు):

పేద, గిరిజన విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు ఆధునిక వసతులు అందించడం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో విద్యారంగానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తూ, మారుమూల గిరిజన ప్రాంతాల్లోని విద్యార్థులు కూడా కార్పొరేట్ స్థాయి విద్యను అందుకునేలా ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని తెలిపారు. శనివారం ఉట్నూరు బాలికల ఆశ్రమ పాఠశాలను సందర్శించిన మంత్రి విద్యా, వసతి సౌకర్యాలను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాజర్షి షా, ఐటీడీఏ పీవో మంద మకరందు, ఎస్పీ అఖిల్ మహాజన్ మంత్రికి ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆయన పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. పాఠశాలలో ఏర్పాటు చేసిన ఐఎఫ్ డిజిటల్ ప్యానెల్‌ను మంత్రి ప్రారంభించి, విద్యార్థులకు అందుబాటులోకి వచ్చిన ఆధునిక సాంకేతిక సౌకర్యాలపై అధికారులను అభినందించారు.

మిగతా 2లో

# కొల్లాపూర్‌లో క్రీడా వసతుల విస్తరణ

- పెంట్లవెల్లి స్టేడియం స్థల పరిశీలన
- వివిధ మండలాల్లో నిర్మాణాలకు కసరత్తు
- యువతకు మెరుగైన క్రీడా అవకాశాలు
- ప్రజా సమస్యల పరిష్కారంపై అధికారులకు ఆదేశాలు
- రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావు

నాగర్‌కర్నూలు, ఆగస్టు 22 (తెలంగాణ ముచ్చట్లు):

కొల్లాపూర్ నియోజకవర్గంలో క్రీడా మౌలిక వసతుల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తున్నట్లు రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు.





# కేంబ్రిడ్జ్‌తో తెలంగాణ విద్యా భాగస్వామ్యం

- హైదరాబాద్‌ను గ్లోబల్ నాలెడ్జ్ హబ్‌గా తీర్చిదిద్దే దిశగా అడుగులు
- కేంబ్రిడ్జ్ ప్రతినిధులతో ముఖ్యమంత్రి భేటీ
- విద్య, పరిశోధన రంగాల్లో సహకారానికి అంగీకారం
- స్టార్టప్‌లు, ఇంక్యుబేషన్ కార్యక్రమాలకు ప్రోత్సాహం

లండన్, ఆగస్టు 22 (తెలంగాణ ముచ్చట్లు):

తెలంగాణ రైజింగ్ అధికారిక ప్రతినిధి బృందం లండన్ పర్యటనలో భాగంగా కేంబ్రిడ్జ్ విశ్వవిద్యాలయానికి చెందిన విద్యావేత్తల బృందంతో కీలక సమావేశం నిర్వహించింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో జరిగిన ఈ సమావేశంలో ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, సీఎం సలహాదారు కె. రామకృష్ణారావు, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్ రంజన్ తదితరులు పాల్గొన్నారు. హైదరాబాద్‌ను ప్రపంచ స్థాయి జ్ఞాన కేంద్రంగా అభివృద్ధి చేయాలనే తెలంగాణ ప్రభుత్వ లక్ష్యాలను ఈ సందర్భంగా ప్రతినిధి బృందం వివరించింది. సమావేశంలో తెలంగాణలో

మిగతా 2లో



# రోడ్లు, వంతెనల పనుల్లో వేగం పెంచాలి

- సీఆర్ఐఎఫ్, సేతుబంధన్ పనులపై సమీక్ష
- నియోజకవర్గాల వారీగా పురోగతి మెరుగుపరచాలని ఆదేశం
- నంది పహాడ్ వంతెన వెంటనే ప్రారంభించాలని సూచన
- మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి

7లో



# ప్రెస్ క్లబ్స్ సమాఖ్యను ప్రారంభించిన భట్టి

- హైదరాబాద్‌లో జాతీయ స్థాయి వేదిక ఆవిష్కరణ
- పత్రికా స్వేచ్ఛ ప్రజాస్వామ్యానికి కీలకం
- జర్నలిస్టుల సంక్షేమంపై దృష్టి పెట్టాలి
- ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు

హైదరాబాద్, ఆగస్టు 22 (తెలంగాణ ముచ్చట్లు):

దేశంలోని పలు రాష్ట్రాల ప్రెస్ క్లబ్‌ల ప్రతినిధులతో ఏర్పాటైన 'ఫెడరేషన్ ఆఫ్ ప్రెస్ క్లబ్స్'ను తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు హైదరాబాద్‌లో ఘనంగా ప్రారంభించారు. దేశవ్యాప్తంగా ఎనిమిది ప్రెస్ క్లబ్‌ల ప్రతినిధులు భాగస్వామ్యంగా ఏర్పడిన ఈ వేదిక జర్నలిస్టుల ఐక్యత, సంక్షేమం, పత్రికా స్వేచ్ఛ పరిరక్షణకు దోహదపడుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

మిగతా 2లో

# ఆయిల్‌ఫామ్ సాగుతో రైతులకు అధిక ఆదాయం

- నర్మెట ఫ్యాక్టరీని సందర్శించిన మాజీ మంత్రులు
- 60 వేల మెట్రిక్ టన్నుల క్రషింగ్‌పై హర్షం
- రిఫైనరీ పనులు వెంటనే ప్రారంభించాలని సూచన
- మరింత మంది రైతులు ఆయిల్‌ఫామ్ సాగు చేపట్టాలని పిలుపు

7లో



తెలంగాణ TELANGANA MUCHATLU
ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# పెండింగ్ దరఖాస్తులపై మంత్రి ఆగ్రహం

(మొదటి పేజీ తరువాయి)

ముఖ్యంగా భూభారతి రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన దరఖాస్తులు, సాదాబైనామా అర్జీల పరిష్కారంలో నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్న తహసీల్దార్లపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలను కార్యాలయాల చుట్టూ తిప్పుతూ ఇబ్బందులకు గురిచేస్తే కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. పదేపదే సూచించినా పనితీరులో మార్పు రాని అధికారులపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజా ప్రభుత్వ లక్ష్యం ప్రజల సమస్యలను త్వరితగతిన పరిష్కరించడమేనని, ప్రతి అధికారి బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు.

రాష్ట్రవ్యాప్తంగా కొనసాగుతున్న భూ రీ సర్వే ప్రక్రియపై మంత్రి ప్రత్యేకంగా దృష్టి సారించారు. వ్యవసాయ భూములతో పాటు ఆబాదీ ఆస్తుల రీసర్వేను కూడా ఏడాదిన్నర లోపు పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు వెల్లడించారు. ప్రస్తుతం ప్రతి జిల్లాలో 70 గ్రామాల్లో తొలి దశ సర్వే కొనసాగుతోందని తెలిపారు. రీసర్వే జరుగుతున్న గ్రామాల్లో కలెక్టర్లు, రెవెన్యూ అధికారులు క్షేత్రస్థాయిలో విస్తృతంగా పర్యటించి ప్రజల సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. భూ వివాదాలకు ముగింపు పలికి ప్రజలకు స్పష్టమైన హక్కులను కల్పించడమే ప్రభుత్వ ప్రధాన



ఉద్దేశమని పేర్కొన్నారు. పేదల సొంతింటి కలను సాకారం చేయడమే ప్రజా ప్రభుత్వ సంకల్పమని మంత్రి పొంగులేటి అన్నారు. కులం, మతం, రాజకీయాలకు అతీతంగా అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు అందిస్తామని స్పష్టం చేశారు. పట్టణాలు, నగరాల్లో స్థలాలు లేని నిరుపేదల కోసం హైదరాబాద్ తరహాలో ఇందిరమ్మ టవర్స్ నిర్మాణానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని తెలిపారు. ఇందులో భాగంగానే నిజామాబాద్‌లో టవర్స్ నిర్మాణానికి అనువైన స్థలాన్ని పరిశీలించినట్లు చెప్పారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు నిర్మాణ వ్యయం తగ్గించేందుకు సిమెంట్ బ్యాగ్‌ను కేవలం రూ.230కే అందించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని వెల్లడించారు. దీంతో పేద కుటుంబాలపై ఆర్థిక భారం తగ్గడమే కాకుండా ఇళ్ల నిర్మాణం వేగవంతం అవుతుందని వివరించారు.

పాముల బస్తీలో ఇందిరమ్మ పథకం కింద నిర్మాణం పూర్తయిన ఇళ్లను మంత్రి స్వయంగా పరిశీలించారు. లబ్ధిదారులతో మాట్లాడి బిల్లుల చెల్లింపులు, నిర్మాణ పురోగతి, ఎదురవుతున్న సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం తమకు సొంతింటి కలను నెరవేర్చిందని లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేయగా, వారి సంతోషంలో భాగస్వామ్యం కావడం తనకు సంతోషంగా ఉందని మంత్రి పేర్కొన్నారు. నూతన గృహ ప్రవేశం చేసిన కుటుంబాలకు శుభాకాంక్షలు తెలియజేస్తూ నూతన వస్త్రాలను బహూకరించారు. చివరి దశలో ఉన్న ఇళ్ల నిర్మాణాన్ని కూడా త్వరగా పూర్తి చేసుకోవాలని సూచించారు. అలాగే డబుల్ బెడ్‌రూమ్ గృహ సముదాయాలను పరిశీలించి పెండింగ్ పనులను వెంటనే పూర్తి చేయాలని కాంట్రాక్టర్లను ఆదేశించారు. రాజీవ్ గాంధీ ఆడిటోరియంలో నిర్వహించిన కార్యక్రమంలో నిజామాబాద్ అర్బన్ నియోజకవర్గానికి చెందిన 400 మంది లబ్ధిదారులకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల కేటాయింపు పత్రాలను మంత్రి అందజేశారు. మరో వారం నుంచి పది రోజుల్లో మరో 300 మంది లబ్ధిదారులకు ఇళ్లు కేటాయిస్తామని వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా మొదటి విడతలో 4.50 లక్షల ఇళ్లు, రెండో విడతలో 2.50 లక్షల ఇళ్లు, హైదరాబాద్‌లో మరో లక్ష ఇళ్లతో కలిపి మొత్తం 8 లక్షల ఇళ్లకు ఇప్పటికే మంజూరు ఇచ్చినట్లు తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల కార్యక్రమం నిరంతర ప్రక్రియ అని, అర్హులైన ప్రతి పేద కుటుంబానికి సొంతింటి కల నెరవేరే వరకు విడతల వారీగా ఇళ్ల మంజూరు కొనసాగుతుందని స్పష్టం చేశారు. గత ప్రభుత్వంలో అసంపూర్తిగా మిగిలిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను కూడా పూర్తి చేసి లబ్ధిదారులకు అందించే బాధ్యతను ప్రజా ప్రభుత్వం తీసుకుందని పేర్కొన్నారు.

# కొల్లాపూర్‌లో క్రీడా వసతుల విస్తరణ

(మొదటి పేజీ తరువాయి)

ఈ నేపథ్యంలో పెంట్లవెల్లి మండల కేంద్రంలో స్టేడియం నిర్మాణానికి ప్రతిపాదించిన స్థలాన్ని పార్టీ నాయకులతో కలిసి ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. నిర్మాణ పనులు త్వరితగతిన ప్రారంభించేలా చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. పెంట్లవెల్లితో పాటు కొల్లాపూర్ పట్టణం, వీపనగండ్ల, పానగల్ మండలం కేతపల్లి గ్రామం, కోడేరు, పెద్దకొత్తపల్లి మండలాల్లో కూడా స్టేడియాల నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు మంత్రి తెలిపారు. అవసరమైన స్థలాల గుర్తింపు, సాంకేతిక అంశాల పరిశీలన కొనసాగుతోందని పేర్కొన్నారు. క్రీడాకారులకు మెరుగైన సదుపాయాలు కల్పించడమే లక్ష్యమని చెప్పారు.

గ్రామీణ ప్రాంతాల యువతలో క్రీడల పట్ల ఆసక్తిని పెంపొందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని జూపల్లి కృష్ణారావు పేర్కొన్నారు. క్రీడా మైదానాలు, స్టేడియాలు అందుబాటులోకి వస్తే ప్రతిభావంతులైన క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించే అవకాశాలు పెరుగుతాయని అభిప్రాయపడ్డారు. విద్యార్థులు, యువత శారీరక దృఢత్వం పెంపొందించుకోవడంలో కూడా ఇవి ఉపయోగపడతాయని తెలిపారు. అనంతరం పెంట్లవెల్లి మండల కేంద్రంలో ప్రజా సమస్యలపై అధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. ముఖ్యంగా రెవెన్యూ సమస్యలు, ప్రజా సేవల అందజేతలో జాప్యం వంటి అంశాలపై చర్చించారు. ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఉండకూడదని అధికారులకు స్పష్టం చేశారు.

ప్రజలు కార్యాలయాలకు వచ్చినప్పుడు వారి సమస్యలను సత్వరమే పరిష్కరించాల్సిన బాధ్యత అధికారులపై ఉందని మంత్రి అన్నారు. రెవెన్యూ సంబంధిత పెండింగ్ అంశాలను ప్రత్యేక కార్యాచరణతో పరిష్కరించాలని సూచించారు. నిర్ణీత కాలవ్యవధిలో



సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజా సేవల్లో జవాబుదారీతనం అత్యంత ముఖ్యమని జూపల్లి కృష్ణారావు పేర్కొన్నారు. సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం, జాప్యాన్ని సహించబోమని అధికారులను హెచ్చరించారు. అభివృద్ధి పనులతో పాటు ప్రజలకు మెరుగైన సేవలు అందించడంపైనా ప్రభుత్వం సమానంగా దృష్టి సారిస్తోందని ఆయన స్పష్టం చేశారు.

# గిరిజన విద్యార్థుల అభ్యున్నతే ప్రభుత్వ ధ్యేయం

(మొదటి పేజీ తరువాయి)

అనంతరం విద్యార్థినులకు యూనిఫాంలు, విద్యా కిట్ల పంపిణీ కార్యక్రమాన్ని జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పేద కుటుంబాలకు చెందిన విద్యార్థులు ఆర్థిక ఇబ్బందుల కారణంగా చదువులకు దూరం కాకుండా ప్రభుత్వం అన్ని రకాల సహాయ సహకారాలు అందిస్తోందన్నారు. యూనిఫాంలు, షూస్, పుస్తకాలు, వసతి, పోషకాహారం వంటి అంశాలను ప్రభుత్వం అత్యంత బాధ్యతగా తీసుకుంటోందని పేర్కొన్నారు. గిరిజన ప్రాంతాల పిల్లలు కూడా ఉన్నత స్థాయి పోటీల్లో రాణించేలా విద్యా ప్రమాణాలను పెంచేందుకు ప్రత్యేక కార్యాచరణ అమలు చేస్తున్నట్లు తెలిపారు.



ఆశ్రమ, గురుకుల పాఠశాలలను కార్పొరేట్ విద్యాసంస్థలకు ఏమాత్రం తీసిపోని విధంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి చెప్పారు. డిజిటల్ తరగతి గదులు, సైన్స్ ప్రయోగశాలలు, ఆధునిక బోధన విధానాలు, క్రీడా సదుపాయాల ద్వారా విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి కృషి చేస్తున్నామని వివరించారు. ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకుని ఉన్నత లక్ష్యాలను సాధించాలని పిలుపునిచ్చారు. ఉపాధ్యాయులు కూడా విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని మరింత అంకితభావంతో పనిచేయాలని సూచించారు. ఎస్సీ, ఎస్టీ సంక్షేమ శాఖల్లో ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీకి చర్యలు తీసుకుంటామని, ఆశ్రమ పాఠశాలల్లో సీఆర్‌టీ సిబ్బంది సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్సీ దండే విఠల్ మాట్లాడుతూ పేద, గిరిజన, వెనుకబడిన వర్గాల విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించి కలెక్టర్లు, వైద్యులు, ఇంజనీర్లు, ఐఏఎస్, ఐపీఎస్ అధికారులుగా ఎదగాలన్నదే ప్రభుత్వ సంకల్పమన్నారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ స్టడీ సర్కిల్, గిరిజన స్టడీ సర్కిల్ వంటి సంస్థల ద్వారా పోటీ పరీక్షలకు ప్రత్యేక శిక్షణ అందిస్తూ అనేక మంది యువతను ఉన్నత ఉద్యోగాలకు సిద్ధం చేస్తున్నామని చెప్పారు. విద్యార్థులు తమ లక్ష్యాల సాధన కోసం కష్టపడి చదివి తల్లిదండ్రులకు, తమ గ్రామాలకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. స్థానిక ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాల పెంపు కోసం ప్రజాప్రతినిధులు, అధికారులు, ఉపాధ్యాయులు సమన్వయంతో పని చేయాల్సిన అవసరం ఉందన్నారు.

జిల్లా కలెక్టర్ రాజర్షి షా మాట్లాడుతూ ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన వసతులు కల్పించేందుకు జిల్లా యంత్రాంగం ప్రత్యేక కార్యాచరణ అమలు చేస్తోందన్నారు. ఫౌండేషనల్ లిటరసీ అండ్ న్యూమరసీ కార్యక్రమం ద్వారా విద్యార్థుల్లో ప్రాథమిక అక్షరాస్యత, సంఖ్యాసామర్థ్యాలను పెంపొందిస్తున్నామని తెలిపారు. గిరిజన సంక్షేమ ప్రాథమిక పాఠశాలల్లో రూ.20 కోట్ల వ్యయంతో మరమ్మతు పనులు చేపట్టినట్లు వెల్లడించారు. విద్యార్థుల పోషకాహారం, ఆరోగ్య పరిస్థితులపై నిరంతర పర్యవేక్షణ కొనసాగుతోందని చెప్పారు. దివ్యాంగ విద్యార్థుల కోసం నిర్వహిస్తున్న వికాసం పాఠశాలను మరింత బలోపేతం చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమం ముగింపులో మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, జిల్లా కలెక్టర్ రాజర్షి షా, ఇతర అధికారులు విద్యార్థినులకు ఏకరూప దుస్తులు, విద్యా కిట్లు పంపిణీ చేశారు. అనంతరం విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనం చేసి వారి సమస్యలు, అభిప్రాయాలను తెలుసుకున్నారు. గిరిజన ప్రాంతాల సమగ్ర అభివృద్ధికి విద్య, వైద్యం, మౌలిక వసతులు, సంక్షేమ కార్యక్రమాలను మరింత బలోపేతం చేస్తామని మంత్రి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ట్రైబల్ వెల్ఫేర్ కమిషనర్ సంతోష్, ఎస్ఈటిడబ్ల్యూ ఫణికుమారి, అదనపు కలెక్టర్ రాజేశ్వర్, ఏఎస్పీ రుత్విక్ సాయి కోటే, ఆర్డీఓ మోహన్ సింగ్, ప్రజాప్రతినిధులు, అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# తెలంగాణ-లివర్‌పూల్ వ్యూహాత్మక భాగస్వామ్యం

(మొదటి పేజీ తరువాయి)

సహకారం పెంపొందించేందుకు పరస్పర ఆసక్తి వ్యక్తమైంది. అలాగే సమాచార సాంకేతిక రంగంలో ఆవిష్కరణలు, నూతన సాంకేతిక పరిజ్ఞానాల అభివృద్ధి, యువతకు ఉపాధి అవకాశాల కల్పనపై కూడా చర్చ సాగింది. క్రీడల రంగంలో ప్రతిభావంతులైన క్రీడాకారుల తయారీ, శిక్షణా కార్యక్రమాలు, అంతర్జాతీయ ప్రమాణాల మౌలిక సదుపాయాల అభివృద్ధిపై ఇరుపక్షాలు అభిప్రాయాలు పంచుకున్నాయి. సృజనాత్మక ఆర్థిక వ్యవస్థలో సినిమా, డిజిటల్ మీడియా, సాంస్కృతిక రంగాల అభివృద్ధికి సంయుక్తంగా పనిచేసే అవకాశాలపై కూడా చర్చించారు.

తెలంగాణను ప్రపంచ పెట్టుబడుల కేంద్రంగా తీర్చిదిద్దే క్రమంలో విదేశీ నగరాలు, సంస్థలతో భాగస్వామ్యాలను రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. ఈ నేపథ్యంలో లివర్‌పూల్‌తో ప్రతిపాదిత భాగస్వామ్యం రాష్ట్రానికి కొత్త అవకాశాలను తెరవగలదని అధికారులు భావిస్తున్నారు. ముఖ్యంగా పరిశ్రమలు, విద్య, నైపుణ్యాభివృద్ధి రంగాలకు ఇది దోహదపడే అవకాశం ఉందని పేర్కొంటున్నారు. ఈ భాగస్వామ్యాన్ని అధికారికంగా ఖరారు చేసేందుకు లివర్‌పూల్ ప్రతినిధి బృందం అక్టోబరులో హైదరాబాద్‌కు రానుంది. ఆ సందర్భన సందర్భంగా పరస్పర అవగాహన ఒప్పందాలు, సంయుక్త కార్యాచరణ ప్రణాళికలపై నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉందని తెలుస్తోంది. తెలంగాణలివర్‌పూల్ సహకారం రెండు ప్రాంతాల అభివృద్ధికి కొత్త దిశను చూపనుందని అధికారులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

# కేంబ్రిడ్జ్‌తో తెలంగాణ విద్యా భాగస్వామ్యం

(మొదటి పేజీ తరువాయి)

ఉన్న విద్యా, సాంకేతిక, పరిశోధనా అవకాశాలను కేంబ్రిడ్జ్ విశ్వవిద్యాలయ ప్రతినిధులకు వివరించారు. ప్రపంచ ప్రఖ్యాత విద్యాసంస్థలు హైదరాబాద్‌లో తమ కార్యకలాపాలను ప్రారంభించి అంతర్జాతీయ స్థాయి విద్యా వాతావరణం ఏర్పాటులో భాగస్వాములు కావాలని ఆహ్వానించారు. ప్రపంచ పెట్టుబడులు, విద్యా భాగస్వామ్యాలు, పరిశోధనా కేంద్రాల ఏర్పాటుకు తెలంగాణ ప్రభుత్వం కల్పిస్తున్న అనుకూల వాతావరణాన్ని కూడా వివరించారు.

కేంబ్రిడ్జ్ జడ్జ్ బిజినెస్ స్కూల్‌కు చెందిన మార్కెటింగ్ ప్రొఫెసర్ జైదీప్ ప్రభు, ఫ్రూగల్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సహచైర్మన్ ప్రొఫెసర్ వెంకటేశ్ గండికోట తెలంగాణతో కలిసి పనిచేయడానికి ఆసక్తి వ్యక్తం చేశారు. హైదరాబాద్‌లో విద్యా కార్యక్రమాలు నిర్వహించడం, అంతర్జాతీయ ప్రమాణాల కోర్సులను అందుబాటులోకి తీసుకురావడం, విద్యార్థులకు కొత్త అవకాశాలు కల్పించడం వంటి అంశాలపై చర్చించారు. విద్యా రంగంతో పాటు పరిశోధన రంగంలోనూ పరస్పర సహకారాన్ని విస్తరించేందుకు ఇరు పక్షాలు అంగీకరించాయి. సంయుక్త పరిశోధన ప్రాజెక్టులు, అధ్యాపకులు మరియు విద్యార్థుల పరస్పర మార్పిడి కార్యక్రమాలు, సాంకేతిక ఆవిష్కరణలకు సంబంధించిన ప్రత్యేక కార్యక్రమాలపై చర్చలు జరిగాయి. ఈ భాగస్వామ్యం ద్వారా తెలంగాణ విద్యార్థులు అంతర్జాతీయ స్థాయి పరిశోధన అవకాశాలను పొందే అవకాశం ఉందని అధికారులు అభిప్రాయపడ్డారు.

స్టార్టప్‌లు, వ్యవస్థాపకత అభివృద్ధి, ఇంక్యుబేషన్ కేంద్రాల ఏర్పాటుపై కూడా సమావేశంలో ప్రత్యేక దృష్టి సారించారు. యువ పారిశ్రామికవేత్తలకు ప్రపంచ స్థాయి మార్గదర్శకత్వం, సాంకేతిక సహకారం అందించే అవకాశాలను పరిశీలించారు. తెలంగాణలో పెరుగుతున్న ఆవిష్కరణల పర్యావరణ వ్యవస్థను మరింత బలోపేతం చేయడానికి కేంబ్రిడ్జ్ అనుభవాన్ని వినియోగించుకోవచ్చని అభిప్రాయపడ్డారు. సమావేశం ముగింపులో విద్యా కార్యక్రమాలు, పరిశోధన, వ్యవస్థాపకత, ఇంక్యుబేషన్ రంగాల్లో పరస్పర సహకారం కోసం ఒక కార్యాచరణ రూపకల్పన చేయాలని ఇరు పక్షాలు నిర్ణయించాయి. హైదరాబాద్‌ను అంతర్జాతీయ విద్యా, పరిశోధన కేంద్రంగా తీర్చిదిద్దే తెలంగాణ ప్రభుత్వ ప్రయత్నాలకు ఈ భాగస్వామ్యం మరింత బలం చేకూర్చనుందని అధికారులు ఆశాభావం వ్యక్తం చేశారు. కేంబ్రిడ్జ్ వంటి ప్రపంచ ప్రఖ్యాత విద్యాసంస్థలతో ఏర్పడుతున్న సంబంధాలు తెలంగాణను గ్లోబల్ నాలెడ్జ్ హబ్‌గా నిలబెట్టే దిశగా కీలక అడుగుగా భావిస్తున్నారు.

# ప్రెస్ క్లబ్స్ సమాఖ్యను ప్రారంభించిన భట్టి

(మొదటి పేజీ తరువాయి)

ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ, ప్రజాస్వామ్య వ్యవస్థ మనుగడకు పత్రికా స్వేచ్ఛ అత్యంత కీలకమని పేర్కొన్నారు. పాలకులను ప్రశ్నించే హక్కు మీడియాకు ఉండాలని, విమర్శలను స్వీకరించే ధైర్యం ప్రభుత్వాలకు కూడా అవసరమని అన్నారు. ప్రజల తరపున ప్రశ్నించే మీడియా వ్యవస్థ బలంగా ఉన్నప్పుడే ప్రజాస్వామ్యం మరింత పటిష్టంగా నిలుస్తుందని వివరించారు.

భారత స్వాతంత్ర్య ఉద్యమం నుంచి నేటి వరకు ప్రజా చైతన్యంలో జర్నలిజం కీలక పాత్ర పోషించిందని ఆయన గుర్తుచేశారు. మహాత్మా గాంధీ, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్, లోకమాన్య తిలక్ వంటి మహనీయులు పత్రికలను సామాజిక, రాజకీయ మార్పులకు శక్తివంతమైన సాధనాలుగా వినియోగించారని తెలిపారు. సమాజ మార్పులో మీడియా పాత్ర ఎప్పటికీ మరువలేనిదని అన్నారు. ప్రస్తుత కాలంలో సమాచార కొరత లేదని, కానీ విశ్వసనీయత కొరత ఉందని భట్టి విక్రమార్క వ్యాఖ్యానించారు. కృత్రిమ మేధస్సు, వాయిస్ క్లోనింగ్ వంటి సాంకేతిక పరిజ్ఞానాల కారణంగా తప్పుడు సమాచారం వేగంగా వ్యాప్తి చెందుతున్న నేపథ్యంలో జర్నలిస్టులకు విశ్వసనీయతే అత్యంత విలువైన ఆస్తిగా మారిందన్నారు. వాస్తవాలను నిర్ధారించి ప్రజలకు అందించడం మీడియా ప్రధాన బాధ్యత అని పేర్కొన్నారు.

జిల్లా, గ్రామీణ ప్రాంతాల్లో పనిచేస్తున్న జర్నలిస్టులు ప్రజల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకువస్తూ సమాజానికి సేవ చేస్తున్నారని ఉప ముఖ్యమంత్రి కొనియాడారు. వారు ప్రభుత్వానికి అత్యుత్తమ ముందస్తు హెచ్చరిక వ్యవస్థగా పనిచేస్తున్నారని పేర్కొన్నారు. జర్నలిస్టుల భద్రత, గౌరవం, ఉద్యోగ పరిస్థితులు, సంక్షేమం, వృత్తి ప్రమాణాల పరిరక్షణకు ఈ సమాఖ్య ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. జర్నలిస్టులు అధికారంలో ఉన్నవారిని ప్రశ్నించడంతో పాటు తమ వృత్తి ప్రమాణాలను కూడా కాపాడుకోవాలని భట్టి విక్రమార్క పిలుపునిచ్చారు. తెలంగాణ గడ్డ స్వభావంలోనే స్వేచ్ఛగా మాట్లాడే, ప్రశ్నించే సంప్రదాయం ఉందని పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా జర్నలిస్టుల ఐక్యత, సంక్షేమం, పత్రికా స్వేచ్ఛ, ప్రజాస్వామ్య విలువల పరిరక్షణకు 'ఫెడరేషన్ ఆఫ్ ప్రెస్ క్లబ్స్' బలమైన వేదికగా ఎదగాలని ఆకాంక్షించారు.

# ఏఐవైఎఫ్ జిల్లా కమిటీ కౌన్సిలర్‌గా గోగుల వెంకన్న ఏకగ్రీవ ఎన్నిక




**ఖమ్మం బ్యూరో, ఆగస్టు 22(తెలంగాణ ముచ్చట్లు):** చింతకాని మండలం నేరడ గ్రామానికి చెందిన గోగుల వెంకన్నను ఏఐవైఎఫ్ జిల్లా కమిటీ కౌన్సిలర్ సభ్యుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.
కోదుమూరు గ్రామంలోని జ్యోతి ఫంక్షన్ హాల్‌లో నిన్న నిర్వహించిన ఏఐవైఎఫ్ 25వ మహాసభలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కొనసాగుతున్న గోగుల వెంకన్నను జిల్లా కమిటీ కౌన్సిలర్ సభ్యుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.
ఈ సందర్భంగా గోగుల వెంకన్నకు నేరడ గ్రామ ప్రజలు, ఏఐవైఎఫ్ నాయకులు, కార్యకర్తలు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా స్థాయిలో మరింత బాధ్యతతో పనిచేస్తూ యువత సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఆకాంక్షించారు.



# సాగునీటి కోసం ఎమ్మెల్యేకు వినతి పత్రం

**వేలేరు, ఆగస్టు 22 (తెలంగాణ ముచ్చట్లు):** వేలేరు మండలంలోని రైతుల సాగునీటి సమస్యల పరిష్కారం కోసం బీఆర్ఎస్ పార్టీ వేలేరు మండల నాయకులు ఎమ్మెల్యే కడియం శ్రీహరికి వినతిపత్రం అందజేశారు. మండలంలోని అన్ని గ్రామాలకు సాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని, ముఖ్యంగా గౌరెల్లి ప్రాజెక్టు ద్వారా నీటిని విడుదల చేసి రైతులను ఆదుకోవాలని వినతిపత్రంలో కోరారు. సాగునీటి కొరతతో రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లిన నాయకులు, తక్షణ చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాల సర్పంచ్‌లు, బీఆర్ఎస్ పార్టీ మండల నాయకులు, సీనియర్ నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రైతుల ప్రయోజనాల కోసం బీఆర్ఎస్ పార్టీ నిరంతరం పోరాడుతుందని, సాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం కోసం కృషి చేస్తుందని తెలిపారు.

# గాలి మాటలతో ప్రజలను మభ్యపెట్టొద్దు..

- **మంత్రి పొన్నం ప్రభాకర్‌కు పృథ్విరాజ్ గౌడ్ డిమాండ్**
- **గౌరవెల్లి ప్రాజెక్టు, కొత్తకొండ మండలం, వీరభద్రస్వామి దేవస్థానం భూములపై స్పష్టత ఇవ్వాలి**



**భీమదేవరపల్లి, ఆగస్టు 22(తెలంగాణ ముచ్చట్లు):** గౌరవెల్లి ప్రాజెక్టు, కొత్తకొండ మండలం ఏర్పాటు, కొత్తకొండ వీరభద్రస్వామి దేవస్థానం భూముల సమస్యలపై మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రజలకు స్పష్టమైన సమాధానం ఇవ్వాలని బీజేపీ జిల్లా కార్యదర్శి పైడిపెల్లి పృథ్విరాజ్ గౌడ్ డిమాండ్ చేశారు. భీమదేవరపల్లి మండలంలో నిర్వహించిన "పల్లె పల్లెకు పొన్నం అన్న" కార్యక్రమంలో ఐదు గ్రామాల్లో పర్యటించినప్పటికీ ప్రజల ప్రధాన సమస్యలపై స్పష్టత రాలేదని ఆయన విమర్శించారు.గౌరవెల్లి ప్రాజెక్టును పూర్తిస్థాయిలో ఎందుకు నింపడం లేదో మంత్రి ప్రజలకు వివరించాలని కోరారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రాజెక్టు పూర్తికాకముందే ట్రయల్ రన్ నిర్వహించి ప్రజలను నమ్మించే ప్రయత్నం చేశారని, అయితే ప్రజలు ఆ పార్టీకి తగిన బుద్ధి చెప్పారని అన్నారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పటికీ ప్రాజెక్టును పూర్తిస్థాయిలో నింపకపోవడానికి కారణమేంటో వెల్లడించాలని డిమాండ్ చేశారు.
ప్రాజెక్టుకు రూ.450 కోట్లు వచ్చాయని ఒకసారి, రూ.250 కోట్లు వచ్చాయని మరోసారి చెబుతున్నారని, దీనివల్ల ప్రజల్లో అయోమయం నెలకొంటోందన్నారు. "రూ.450 కోట్లా.. రూ.250 కోట్లా? లెక్క ఒక్కటే ఉండాలి.. మాటలు మాత్రం మారకూడదు" అని పృథ్విరాజ్ గౌడ్ వ్యాఖ్యానించారు. గౌరవెల్లి ప్రాజెక్టు నిండితే భూగర్భజలాలు పెరిగి రైతాంగానికి ఎంతో ప్రయోజనం కలుగుతుందని తెలిపారు.
కొత్తకొండ మండలం ఏర్పాటుపై కూడా ప్రభుత్వం స్పష్టమైన కాలపరిమితిని ప్రకటించాలని కోరారు. వేలేరు మండలం ఏర్పాటు చేసిన సమయంలో కొత్తకొండను ఎందుకు పక్కన పెట్టారో మంత్రి వివరించాలని ప్రశ్నించారు. "కొత్తకొండ మండలం ఫైలు ఏ టేబుల్‌పై ఉందో అయినా చెప్పండి.. ప్రజలు ఎదురుచూస్తున్నారు" అని అన్నారు.
ఉత్తర తెలంగాణలో ప్రసిద్ధి చెందిన కొత్తకొండ వీరభద్రస్వామి దేవస్థానానికి సంబంధించిన భూముల సమస్యను ఎప్పుడు పరిష్కరిస్తారో ప్రభుత్వం వెల్లడించాలని డిమాండ్ చేశారు. దేవస్థానం అభివృద్ధి చేస్తామని ప్రకటనలు చేయడం తప్ప గత పదేళ్లలో, ప్రస్తుత ప్రభుత్వ హయాంలోనూ సొంత నిధుల నుంచి ఒక్క రూపాయి కూడా కేటాయించలేదని విమర్శించారు.
మాటల్లో అభివృద్ధి పరుగులు పెడుతోంది.. పనుల్లో మాత్రం అడుగు కదలడం లేదు అని ఎద్దేవా చేశారు. గౌరవెల్లి నీరు, కొత్తకొండ మండలం, వీరభద్రస్వామి దేవస్థానం భూముల సమస్యలపై కాలపరిమితితో కూడిన స్పష్టమైన హామీ ఇవ్వాలని కోరారు. గాలి మాటలతో ప్రజలను మభ్యపెట్టే రోజులు పోయాయని, ప్రజలు అన్ని విషయాలను గమనిస్తున్నారని పృథ్విరాజ్ గౌడ్ హెచ్చరించారు.

# ఖమ్మం ప్రెస్ క్లబ్ లో ఘనంగా కలం యోధుడు షహీద్ షోయాబుల్లాఖాన్ 78వ వర్ధంతి వేడుకలు

- **టిడబ్ల్యూజేఎఫ్ హెచ్2843 వ్యవస్థాపకులు మామిడి సోమయ్య యూనియన్, ఖమ్మం జిల్లా అధ్యక్షులు నానబాల రామకృష్ణ, కార్యదర్శి అర్వపల్లి నగేష్**
- **అసమాన కలం యోధుడు షహీద్ షోయబుల్లా ఖాన్**



**ఖమ్మం బ్యూరో, ఆగస్టు22 (తెలంగాణ ముచ్చట్లు ):** నిరంకుశత్వంపై అక్షరాన్నే ఆయుధంగా మలిచి, నిజాం పాలనకు వ్యతిరేకంగా పోరాడిన అసమాన కలం యోధుడు షహీద్ షోయబుల్లా ఖాన్. హైదరాబాద్ సంస్థానాన్ని భారత యూనియన్‌లో విలీనం చేయాలని, ప్రజాస్వామ్య పాలన రావాలని కోరుతూ తన రచనల ద్వారా ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చిన ధీర జర్నలిస్టుగా ఆయన చరిత్రలో నిలిచిపోయారు. షోయబుల్లా ఖాన్ 1920 అక్టోబర్ 17న ఖమ్మం జిల్లాలోని సుబ్లేడు గ్రామంలో హబీబుల్లా ఖాన్, లాయహున్నిసా బేగం దంపతులకు జన్మించారు. ఆయన తండ్రి హబీబుల్లా ఖాన్ రైల్వే శాఖ లో పనిచేసేవారు. మహాత్మాగాంధీకి ఆయన వీరాభిమాని. గాంధీజీ పట్ల ఉన్న అభిమానంతో తన కుమారుడిని ప్రేమగా 'షోయబుల్లా గాంధీ' అని పిలిచేవారని చారిత్రక కథనాలు పేర్కొంటున్నాయి.
బాల్యం నుంచే షోయబుల్లా ఖాన్ కు సమాజం పట్ల అవగాహన పెరిగింది. బొంబాయిలో ఇంటర్మీడియట్ వరకు చదువుకున్న ఆయన హైదరాబాద్ ఉస్మానియా విశ్వవిద్యాలయంలో బీ.ఏ తో పాటు జర్నలిజం విద్యను అభ్యసించారు. మంచి ఉద్యోగం పొందే అవకాశాలు ఉన్నప్పటికీ నిరంకుశ పాలనను ప్రశ్నించేందుకు జర్నలిజాన్ని తన వృత్తిగా ఎంచుకున్నారు.
జాతీయ భావాలను ప్రోత్సహిస్తున్న 'తేజ్' ఉర్దూ వారపత్రికలో సబ్‌ఎడిటర్‌గా చేరిన షోయబుల్లా ఖాన్ నిజాం పాలకులు, వారి అనుచరులైన భూస్వాములు, రజాకారులు ప్రజలపై సాగిస్తున్న దురాగతాలను తన రచనల ద్వారా ఎండగట్టారు. ఆయన రచనలు నిజాం పాలకులకు ఆగ్రహం తెప్పించడంతో 'తేజ్' పత్రిక నిషేధానికి గురైంది. ఆ తర్వాత మందుముల నరసింగరావు ఆధ్వర్యంలో నడిచిన 'రయ్యత్' ఉర్దూ పత్రికలో చేరి తన కలానికి మరింత పదును పెట్టారు. బెదిరింపు లేఖలు వచ్చినప్పటికీ ఆయన వెనక్కి తగ్గలేదు. చివరకు 'రయ్యత్' పత్రిక కూడా నిజాం ప్రభుత్వ ఆగ్రహానికి గురై మూతపడింది. అయినప్పటికీ ప్రజల తరఫున తన పోరాటాన్ని కొనసాగించాలని షోయబుల్లా ఖాన్ నిర్ణయించుకున్నారు.
'ఇమ్రోజ్' పత్రిక స్థాపన.
స్వయంగా జాతీయ భావాలతో కూడిన పత్రికను ప్రారంభించాలని నిర్ణయించుకున్న, షోయబుల్లా ఖాన్ తన తల్లి, భార్య నగలను విక్రయించి వచ్చిన డబ్బుతో, బూర్గుల రామకృష్ణారావు ఇంటిని అద్దెకు తీసుకుని 'ఇమ్రోజ్' అనే ఉర్దూ దినపత్రికను ప్రారంభించారు. 1947 నవంబర్ 15న 'ఇమ్రోజ్' తొలి సంచిక వెలువడింది.
ఆర్థిక ఇబ్బందులు ఎదురైనా పత్రికను ప్రజల గొంతుకగా తీర్చిదిద్దారు. నిజాం నిరంకుశత్వం, రజాకారుల మతదురహంకారం, ప్రజలపై జరుగుతున్న దాడులను ఆయన తన సంపాదకీయాలు, కథనాల ద్వారా తీవ్రంగా విమర్శించారు.
దేశానికి 1947 ఆగస్టు 15న స్వాతంత్ర్యం వచ్చినప్పటికీ హైదరాబాద్ సంస్థానాన్ని భారత యూనియన్‌లో విలీనం చేయడానికి నిజాం నిరాకరించాడు. ఈ పరిస్థితుల్లో హైదరాబాద్ సంస్థానం భారతదేశంలో విలీనం కావాలని షోయబుల్లా ఖాన్ 'ఇమ్రోజ్' ద్వారా బలంగా డిమాండ్ చేశారు.
జాతీయ ప్రయోజనాల దృష్ట్యా హైదరాబాద్ భారత యూనియన్‌లో విలీనం కావాల్సిన అవసరాన్ని వివరిస్తూ, ఆయన అనేక సంపాదకీయాలు రాశారు. హైదరాబాద్ ప్రజల్లో ఎక్కువమంది ఉర్దూ చదువుకున్నవారు కావడంతో 'ఇమ్రోజ్' రచనలు ప్రజలు, మేధావులపై గణనీయమైన ప్రభావం చూపాయి.
1948 జనవరి 29న 'ఇమ్రోజ్'లో ప్రచురించిన 'పగటి ప్రభుత్వం-రాత్రి ప్రభుత్వం' అనే సంపాదకీయం షోయబుల్లా ఖాన్ ధైర్యసాహసాలకు నిదర్శనంగా నిలిచింది. ఆయన రచనలు నిజాం ప్రభుత్వానికి, రజాకారులకు తీవ్ర ఆగ్రహాన్ని కలిగించాయి.
ఖాసిం రజ్వీ బెదిరింపులు.
షోయబుల్లా ఖాన్ పై రజాకార్ల నాయకుడు ఖాసిం రజ్వీ నుంచి బెదిరింపులు వచ్చాయి. అయినప్పటికీ ఆయన తన రచనా పోరాటాన్ని ఆపలేదు. అన్యాయం ఎక్కడ జరిగినా అక్కడికి వెళ్లి వాస్తవాలను వెలుగులోకి తెచ్చారు.
1948 ఆగస్టు 19న నిజాం వ్యతిరేకంగా వార్తలు, వ్యాసాలు రాస్తే చేతులు నరికేస్తామని, ఖాసిం రజ్వీ బహిరంగంగా హెచ్చరించినట్లు, చారిత్రక కథనాలు పేర్కొంటున్నాయి. అయితే షోయబుల్లా ఖాన్ మాత్రం వెనక్కి తగ్గలేదు. సత్యం కోసం పోరాడుతూ ప్రాణాలు కోల్పోవడం కూడా గర్వించదగ్గ విషయమేనని ఆయన ధైర్యంగా ప్రకటించారు.
ఆగస్టు 21 అర్ధరాత్రి దారుణ దాడి.
1948 ఆగస్టు 21 అర్ధరాత్రి కాచిగూడ ప్రాంతంలోని 'ఇమ్రోజ్' కార్యాలయంలో పని ముగించుకుని షోయబుల్లా ఖాన్ తన బావమరిది ఇస్మాయిల్ ఖాన్‌తో కలిసి ఇంటికి బయలుదేరారు.
చప్పల్ బజార్ ప్రాంతానికి చేరుకున్న సమయంలో సాయుధ దుండగులు వారిపై దాడి చేశారు. షోయబుల్లా ఖాన్‌పై కాల్పులు జరిపి తీవ్రంగా గాయపరిచారు. అనంతరం ఆయన చేతులను దారుణంగా నరికారు. దాడిని అడ్డుకునేందుకు ప్రయత్నించిన ఆయన బావమరిది ఇస్మాయిల్ ఖాన్ కూడా తీవ్రంగా గాయపడ్డారు.
కాల్పుల శబ్దాలు విని స్థానిక ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రావడంతో దుండగులు అక్కడి నుంచి పారిపోయారు. తీవ్ర గాయాలతో రక్తపు మడుగులో ఉన్న షోయబుల్లా ఖాన్‌ను ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు.
దేశం కోసం మరణిస్తున్నానని గర్వంగా చెప్పిన షోయబుల్లా.
ఆగస్టు 22 తెల్లవారుజామున షోయబుల్లా ఖాన్ స్పృహలోకి వచ్చారు. తన చివరి క్షణాల్లో కూడా ఆయన ధైర్యాన్ని కోల్పోలేదు. మరణం అనివార్యమని, మంచి లక్ష్యం కోసం ప్రాణాలు అర్పించడం గర్వించదగ్గ విషయమని తన తల్లిదండ్రులకు, భార్యకు ధైర్యం చెప్పినట్లు చారిత్రక కథనాలు పేర్కొంటున్నాయి.
నిజాం నిరంకుశత్వాన్ని తన కలంతో సవాలు చేసిన షోయబుల్లా ఖాన్ 28 ఏళ్ల వయసులోనే 1948 ఆగస్టు 22న తుదిశ్వాస విడిచారు.
షోయబుల్లా ఖాన్ తన మతానికి చెందిన నిజాం పాలకుడే అయినప్పటికీ నిరంకుశ పాలనను సమర్థించలేదు. రజాకారులు తన మతస్తులే అయినప్పటికీ వారి దారుణాలను ఖండించడంలో వెనుకాడలేదు. మతం పేరుతో జరిగే మతోన్మాదాన్ని ఆయన వ్యతిరేకించారు.
హైదరాబాద్ సంస్థానం భారతదేశంలో విలీనం కావాలని, మతమౌఢ్యం లేని ప్రజాస్వామ్య పాలన ఏర్పడాలని ఆయన కలలు కన్నారు. ఆ లక్ష్యం కోసం నడిరోడ్డుపైనే తన ప్రాణాలను త్యాగం చేశారు.
పత్రికా స్వేచ్ఛ, ప్రజాస్వామిక విలువలు, లౌకిక భావాలు, ప్రజల హక్కుల కోసం తన కలాన్ని ఆయుధంగా మార్చుకున్న షోయబుల్లా ఖాన్ త్యాగం నేటి జర్నలిస్టులకు, ప్రజాస్వామ్యవాదులకు స్ఫూర్తిదాయకం. ఆగస్టు 22న ఆయన వర్ధంతి సందర్భంగా ఈ అసమాన కలం యోధుడి సేవలను స్మరించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత.
షోయబుల్లా ఖాన్ అమరత్వం ప్రజాస్వామ్య పోరాటానికి చిరస్మరణీయం.
ఈ కార్యక్రమంలో టీడబ్ల్యూజేఎఫ్ హెచ్ 2843 కోశాధికారి వేములకొండ రమేష్, నేషనల్ కౌన్సిల్ మెంబర్ ఎలుగోటి వెంకట్, స్టేట్ కౌన్సిల్ మెంబర్ నల్లా రాకేష్ రెడ్డి, టీబీజేఏ జిల్లా కార్యదర్శి కాసోజు శ్రీధర్, వీడియో గ్రాఫర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు అమరబోయిన ఉపేందర్, టిడబ్ల్యూజేఎఫ్ నగర అధ్యక్షులు గంటేల కుమార్, కార్యదర్శి కప్పల మధు గౌడ్, ప్రెస్ క్లబ్ అధ్యక్షులు అంతోటి శ్రీనివాస్, కిరణ్ కుమార్, గుజ్జు గోపాలకృష్ణ, చిన్నంశెట్టి రాంబాబు, పాగా యోనా, మేకల రవి, మొగిలి నాగేశ్వరరావు, షేక్ మీరా, ఎలిశెట్టి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# కేంద్ర సహకార మంత్రిత్వ శాఖ డైరెక్టర్ ముల్కనూర్ సహకార సంఘం సందర్శన



**భీమదేవరపల్లి, ఆగస్టు 22(తెలంగాణ ముచ్చట్లు):** భారత ప్రభుత్వ సహకార మంత్రిత్వ శాఖ డైరెక్టర్ శ్రీ వినయ్ శీల్ గౌతమ్ ముల్కనూర్ సహకార గ్రామీణ పరపతి మరియు మార్కెటింగ్ సంఘాన్ని సందర్శించారు. దేశంలో విజయవంతంగా పనిచేస్తున్న ప్రాథమిక సహకార సంస్థల నమూనాలను అధ్యయనం చేసే ఉద్దేశంతో ఆయన సంఘం కార్యకలాపాలను పరిశీలించారు.
ఈ సందర్భంగా సంఘ అధ్యక్షులు అలిగిరెడ్డి ప్రవీణ్ రెడ్డి డైరెక్టర్‌తో సమావేశమై సంఘ కార్యాలయ ప్రాంగణం, వివిధ విభాగాలు, ఆర్థిక, వాణిజ్య కార్యకలాపాలను వివరించారు. అనంతరం నిర్వహించిన ప్రజెంటేషన్‌లో ముల్కనూర్ సహకార నమూనా, రైతుల ఆదాయ పెంపు, సంఘ ఆధునీకరణ, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం వినియోగం, ప్రక్రియల మెరుగుదల, భవిష్యత్ అభివృద్ధి ప్రణాళికలను వివరించారు.
ముల్కనూర్ సహకార సంఘం పనితీరును వినయ్ శీల్ గౌతమ్ ప్రశంసించారు. గ్రామీణ ప్రాంతాల ఆర్థికాభివృద్ధి, రైతుల సంక్షేమానికి సంఘం అందిస్తున్న సేవలు అభినందనీయమన్నారు. సంఘంలో అమలవుతున్న ఉత్తమ విధానాలను దేశవ్యాప్తంగా అధ్యయనం చేసి, ఇతర ప్రాంతాల్లోనూ అమలు చేయవచ్చని పేర్కొన్నారు.దేశవ్యాప్తంగా ముల్కనూర్ తరహాలో వేలాది విజయవంతమైన సహకార సంస్థలు ఏర్పడితే గ్రామీణ భారత ఆర్థికాభివృద్ధిలో సహకార రంగం మరింత కీలక పాత్ర పోషిస్తుందని ఆయన అన్నారు.ఈ కార్యక్రమంలో హనుమకొండ జిల్లా సహకార అధికారి బానోతు మోహన్, సహకార మంత్రిత్వ శాఖ అసిస్టెంట్ రిజిస్ట్రార్ మహ్మద్ యూషఫ్ ఆలీ, సంఘ జనరల్ మేనేజర్ రాం రెడ్డి, అసిస్టెంట్ జనరల్ మేనేజర్ సతీష్ తదితరులు పాల్గొన్నారు.

# మానవత్వం చాటిన తాటిపాముల ఉద్యోగులు



**వనపర్తి,ఆగస్టు22(తెలంగాణ ముచ్చట్లు):** మానవత్వంతో స్పందించి పేద కుటుంబానికి ఆర్థిక సహాయం అందించి తాటిపాముల గ్రామానికి చెందిన ఉద్యోగులు తమ సేవా గుణాన్ని చాటుకున్నారు. తాటిపాముల గ్రామానికి చెందిన బొయ్య చిన్న అబ్దుల్లా ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. దీంతో భార్య ఒంటరిగా మిగలడంతో పాటు కుటుంబం తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటోంది. దశదిన కర్మ నిర్వహణకు కూడా ఆర్థిక ఇబ్బందులు ఉన్న విషయాన్ని గ్రామానికి చెందిన ధర్మరాజ్ తదితరులు తాటిపాముల ఉద్యోగుల దృష్టికి తీసుకెళ్లారు.విషయం తెలుసుకున్న బొయ్య అంకె ఆంజనేయులు, బొయ్య అంకె రాజు, బొయ్య అంకె వీరాస్వామి, బొయ్య అంకె కురుమూర్తి స్పందించి నలుగురూ కలిసి రూ.12,000/ ఆర్థిక సహాయాన్ని బాధిత కుటుంబానికి అందజేశారు. ఈ సహాయం దశదిన కర్మ నిర్వహణకు కొంతమేర ఉపశమనం కలిగించింది.ఈ సందర్భంగా సాహితీ కళా వేదిక వనపర్తి జిల్లా అధ్యక్షులు పలుస శంకర్ గౌడ్ ఉద్యోగులను ప్రత్యేకంగా అభినందించారు. ఆపదలో ఉన్నవారికి అండగా నిలవడం అందరికీ ఆదర్శమని, సమాజంలో ప్రతి ఒక్కరూ తమకు చేతనైనంత సాయం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. మానవత్వంతో చేసే చిన్న సహాయమే బాధిత కుటుంబాలకు గొప్ప భరోసానిస్తుందని శంకర్ గౌడ్ పేర్కొన్నారు.

తెలంగాణ ముచ్చట్లు TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# మణిగిల్ల సర్పంచ్ పలుస శ్రీనివాస్ గౌడ్



- **మణిగిల్ల సర్పంచ్ పలుస శ్రీనివాస్ గౌడ్**

**పెద్దమందడి,ఆగస్టు22(తెలంగాణ ముచ్చట్లు):** పెద్దమందడి మండలం మణిగిల్ల గ్రామ ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తూ ముందుకు సాగుతున్నామని మణిగిల్ల గ్రామ సర్పంచ్ పలుస శ్రీనివాస్ గౌడ్ అన్నారు. శనివారం ఉపసర్పంచ్ ముప్పూరి గణేష్ కుమార్‌తో కలిసి మార్నింగ్ వాక్ నిర్వహించిన ఆయన 3వ వార్డులో ఇంటింటికీ తిరుగుతూ ప్రజల సమస్యలను తెలుసుకున్నారు.ఈ సందర్భంగా సీసీ రోడ్డుపై వేగంగా వెళ్తున్న వాహనాల నియంత్రణకు స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేస్తామని, ఇళ్ల మధ్యలో ఉన్న విద్యుత్ స్తంభాలను రోడ్డు వైపునకు మార్చేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. అలాగే అండర్ డ్రైనేజీ పనులను త్వరలో ప్రారంభించి, అవసరమైన చోట్ల వీధి దీపాలు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ ముప్పూరి గణేష్ కుమార్‌తో పాటు బోయిన కృష్ణయ్య, ఆనంద్ రెడ్డి, జాజల మహేష్, మేకల చెన్నయ్య, మేకల కురుమన్న, బోయిని యాదయ్య, 2వ వార్డు సభ్యుడు శ్రీకాంత్ రెడ్డి, కావలి శివ, భూపని బాలరాజు, భూపని కుమార్, మేకల యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

# బీచుపల్లి ఆంజనేయస్వామిని దర్శించుకున్న మాజీ ఎంపీ రావుల



**వనపర్తి,ఆగస్టు22(తెలంగాణ ముచ్చట్లు):** శ్రావణ మాసం సందర్భంగా మాజీ ఎంపీ రావుల చంద్రశేఖర్‌రెడ్డి శుక్రవారం బీచుపల్లి ఆంజనేయస్వామి ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆంజనేయస్వామిని తన ఇష్టదైవంగా భావించే రావుల చంద్రశేఖర్‌రెడ్డి స్వామివారికి ప్రత్యేక పూజలు చేసి ఆశీస్సులు పొందారు.ఈ సందర్భంగా ఆలయ అధికారులు, అర్చకులు ఆయనకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి శేషవస్త్రం బహుకరించి సన్మానించారు. అనంతరం రావుల చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ బీచుపల్లి పుణ్యక్షేత్రం అత్యంత మహిమాన్వితమైన క్షేత్రమని అన్నారు. ఆంజనేయస్వామి తన ఇష్టదైవమని, ప్రజలంతా సుభిక్షంగా, సౌభాగ్యంగా, ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో సుఖసంతోషాలతో జీవించేలా ఆశీర్వదించాలని స్వామి వారిని ప్రార్థించినట్లు తెలిపారు.రావుల చంద్రశేఖర్‌రెడ్డి వెంట జిల్లా మీడియా కన్వీనర్ నందిమల్ల అశోక్, మాజీ జెడ్పీటీసీ కర్రీస్వామి, ఎం. రాజశేఖర్, సాయిప్రసాద్, గోపిబాబు, డాక్టర్ ఆనంద్, అలిపీర్, సీతారా వెంకటేశ్వర్లు, వడ్డే రమేష్, టి.ఎన్. ఎల్లారెడ్డి, సందీప్, మాజీ సర్పంచ్ యాదయ్య, కొత్తకోట బాలయ్య, లక్ష్మణ్ గౌడ్, శివప్రసాద్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# కోమట్లగూడెంలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ



**ఖమ్మం బ్యూరో ,ఆగస్టు 22(తెలంగాణ ముచ్చట్లు):** తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న ఆహార భద్రత స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో భాగంగా చింతకాని మండల పరిధిలోని కోమట్లగూడెం గ్రామంలో శనివారం లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు. గ్రామపంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కొండూరు పరిశుద్ధరావు చేతుల మీదుగా కొత్తపల్లి నాగలక్ష్మి, వేముల రేణుకలకు స్మార్ట్ రేషన్ కార్డులను అందజేశారు. ఈ సందర్భంగా అర్హులైన కుటుంబాలకు ప్రభుత్వం అందిస్తున్న రేషన్ సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి కొడాల రాధారాణి, జీపీవో సంపత్ కుమార్, ఉపసర్పంచ్ ఆవుల రామిరెడ్డి, వార్డు సభ్యులు రాయల శ్రీను, వేముల వెంకటేశ్వర్లు, రాయల బాబు, బలవంతపు కుటుంబరావు, గ్రామ పెద్దలు బత్తుల వెంకటేశ్వర్లు, పల్లపు అంకాలు, వేముల సీతారాములుతో పాటు గ్రామ ప్రజలు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

# భజనలతో మారుమోగిన కొండలయ్య గుట్ట





**వనపర్తి,ఆగస్టు23(తెలంగాణ ముచ్చట్లు):** జిల్లా కేంద్రానికి కూతవేటు దూరంలో ఉన్న పెద్దమందడి మండలం జగత్‌పల్లి కొండలయ్య గుట్ట శ్రావణ మాసం రెండో శనివారం భక్తజన సందోహంతో ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. భజన కీర్తనలు, భక్తుల జయజయధ్వానాలతో గుట్ట మారుమోగింది. సుమారు రెండున్నర దశాబ్దాల తర్వాత కొండలయ్య గుట్టకు పూర్వ వైభవం సంతరించుకోవడంతో భక్తులు పులకించిపోయారు.శ్రీ విశ్వకర్మ గాయత్రి ఆశ్రమ ట్రస్ట్ ఆధ్వర్యంలో గుట్టకు వచ్చిన భక్తులకు మంచినీటి వసతితో పాటు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. అచ్యుతాపురం, రాజపేట గ్రామాలకు చెందిన భజన భక్త బృందాలు గుట్టపైకి చేరుకుని భక్తి గీతాలు ఆలపించడంతో పరిసర ప్రాంతమంతా భక్తి పారవశ్యంలో మునిగిపోయింది. మహిళలు బొడ్డెమ్మలు వేస్తూ భక్తి గీతాలు ఆలపించారు. వందలాది మంది భక్తులు బారులు తీరి కొండలయ్య స్వామివారిని దర్శించుకున్నారు. మోకాళ్ల నొప్పులున్న వృద్ధులూ కొండెక్కారు వయసు పైబడటంతో పాటు మోకాళ్ల నొప్పుల కారణంగా ఇన్నాళ్లు గుట్ట ఎక్కలేకపోయిన పలువురు వృద్ధులు సైతం శనివారం కొండపైకి చేరుకుని స్వామివారిని దర్శించుకున్నారు. అంతా స్వామివారి దయే' అంటూ వారు ఆనందం వ్యక్తం చేశారు. స్వామివారి కృపాకటాక్షంతోనే గుట్ట ఎక్కగలిగామని పలువురు భక్తులు భావోద్వేగానికి గురయ్యారు.జగత్‌పల్లి, అచ్యుతాపురం, రాజనగరం, నాగవరం, రాజపేట గ్రామాలకు చెందిన భక్తులు ట్రస్ట్ ఆధ్వర్యంలో చేసిన ఏర్పాట్లపై హర్షం వ్యక్తం చేశారు. భక్తులకు అవసరమైన వసతులు కల్పించిన విశ్వకర్మ గాయత్రి ఆశ్రమ నిర్వాహకులకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో శ్రీ విశ్వకర్మ గాయత్రి ఆశ్రమ ట్రస్ట్ నిర్వాహకులు అరుణ్‌కుమార్ స్వామి, సర్పంచ్ పెంటన్న యాదవ్, మాజీ సర్పంచ్‌లు నిరంజన్ గౌడ్, మోహన్‌కుమార్ యాదవ్, మాజీ గొర్రెల కాపరుల సంఘం జిల్లా అధ్యక్షుడు పెండెం కురుమూర్తి యాదవ్, విశ్రాంత ఎంపీడీవో రవీంద్రబాబు, విశ్రాంత ఉపాధ్యాయులు బూరుగుపల్లి శేఖర్‌రెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, మాజీ ఉపసర్పంచ్ బుచ్చన్న నాయుడు, రవీందర్ యాదవ్, సుధాకర్ యాదవ్, వెంకటేష్ పాల్గొన్నారు.

# ఏఎస్ఐ శ్రీనివాస్ చర్మకు ఘన సన్మానం




**బడిజపల్లి,ఆగస్టు23(తెలంగాణ ముచ్చట్లు):** పెద్దమందడి మండలం బలిజపల్లి గ్రామంలో నిర్వహించిన వీరభద్రస్వామి ధ్వజస్తంభం ప్రతిష్ఠ, పోచమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాల్లో సమర్థవంతంగా విధులు నిర్వహించిన ఏఎస్ఐ శ్రీనివాస్ చర్మను గ్రామ ప్రజలు ఘనంగా సన్మానించారు.విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాలకు పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చిన నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా బందోబస్తు ఏర్పాట్లను ఏఎస్ఐ శ్రీనివాస్ చర్మ సమర్థంగా పర్యవేక్షించారు. కార్యక్రమం ప్రశాంత వాతావరణంలో సజావుగా జరిగేలా పోలీసు సిబ్బందితో కలిసి విధులు నిర్వహించారు.ఈ సందర్భంగా గ్రామ ప్రజలు ఆయన సేవలను అభినందిస్తూ శాలువాతో ఘనంగా సన్మానించారు. గ్రామంలో ఆధ్యాత్మిక కార్యక్రమాలు ప్రశాంతంగా జరిగేలా పోలీసు శాఖ తరఫున అందించిన సహకారానికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, ప్రజలు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# పుట్టు పంచే, గృహప్రవేశ వేడుకలకు హాజరైన మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి

**ఖిల్లా ఘనపూర్,ఆగస్టు22(తెలంగాణ ముచ్చట్లు):** ఖిల్లా ఘనపూర్ మండలం సోలిపూర్ గ్రామంలో నిర్వహించిన పుట్టు పంచే, నూతన గృహప్రవేశ కార్యక్రమాల్లో మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి పాల్గొన్నారు.వనపర్తి మాజీ మార్కెట్ వైస్‌చైర్మన్ బాలేశ్వర్‌రెడ్డి, సూపర్‌వైజర్ దాసరి మూర్తి-పద్మ దంపతుల కుమారులు వినయ్, ఉదయ్, దీక్షిత్‌ల



పుట్టు పంచే కార్యక్రమంతో పాటు నూతన గృహప్రవేశ వేడుకలను కుటుంబ సభ్యులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యక్రమానికి హాజరైన నిరంజన్‌రెడ్డి కుటుంబ సభ్యులను అభినందించి, చిన్నారులకు ఆశీర్వాదాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎం.డి. కరీం పాషా, ఉపసర్పంచ్ నవీన్‌రెడ్డి, రంజిత్‌రెడ్డి, శేఖర్‌గౌడ్, అశోక్, వార్డు సభ్యుడు జానయ్య, కాశన్న, హాజీ భాష తదితర బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.





# ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యం మెరుగుపరచాలి

- **పేదలకు అందని స్థాయిలో వైద్య సేవలు ఉంటే ఎలా..?**
- **మాజీ ఎమ్మెల్యే సండ్ర.**

**సత్తుపల్లి, ఆగస్టు 22(తెలంగాణ ముచ్చట్లు):** పేదలు, సామాన్య ప్రజలకు అందుబాటులో ఉండాల్సిన ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్య సేవలు మరింత మెరుగుపడాల్సిన అవసరం ఉందని మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య అన్నారు. సత్తుపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో 100 పడకల నూతన భవనం, సుమారు 17 మంది వైద్యులు ఉన్నప్పటికీ ప్రజలకు ఆశించిన స్థాయిలో సేవలు అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. వైద్యులు విధులకు సక్రమంగా హాజరు కావడం లేదని, కొందరు ముందుగానే వెళ్లిపోతున్నారని ప్రజల నుంచి ఫిర్యాదులు వస్తున్నాయని తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే రోగులను ప్రైవేట్ ఆసుపత్రులకు వెళ్లాలని సూచిస్తున్నారనే ఆరోపణలపైనా అధికారులు దృష్టి సారించాలన్నారు. ఆసుపత్రిలో మంచినీటి సదుపాయం, మృతదేహాలకు పోస్టుమార్టం నిర్వహణ వంటి అంశాల్లోనూ సమస్యలు ఉన్నాయని పేర్కొన్నారు. ధ్రువపత్రాల జారీకి డబ్బులు అడుగుతున్నారనే ఆరోపణలు వస్తున్న నేపథ్యంలో సమగ్ర విచారణ జరిపించాలని కోరారు. రేజర్ల గ్రామానికి చెందిన ఓ వ్యక్తిని పాము కాటుకు గురైన అనంతరం సత్తుపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకురాగా, సుమారు రెండున్నర గంటలపాటు యాంటీ స్నేక్ వెనం (పాము కాటు విషానికి ఇచ్చే యాంటీవెనమ్) అందలేదనే ఆరోపణలు వచ్చాయని సండ్ర తెలిపారు. పరిస్థితి విషమించడంతో ఖమ్మం ఆసుపత్రికి తరలించాల్సి వచ్చిందన్నారు. అత్యవసర పరిస్థితుల్లో ప్రాణాలను కాపాడే మందులు, వైద్య సేవలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆసుపత్రి విషయంలో రాజకీయాలకు, ఒత్తిళ్లకు తావు ఉండకూడదని సండ్ర స్పష్టం చేశారు. రాజకీయాలు వేరని, ప్రజల ప్రాణాలు వేరని అన్నారు. వైద్య వృత్తిని ప్రజలు పవిత్రంగా భావిస్తారని, వైద్యులను భగవంతుడితో సమానంగా గౌరవిస్తారని గుర్తుచేశారు. వైద్యులు, సిబ్బంది రోగుల పట్ల మానవతా దృక్పథంతో వ్యవహరించాలని, అవసరమైన సమయంలో అందుబాటులో ఉండాలని కోరారు. ఓపీతో పాటు అన్ని విభాగాల్లోనూ నిరుపేదలకు నాణ్యమైన వైద్యం అందేలా అధికారులు చర్యలు చేపట్టాలని సండ్ర డిమాండ్ చేశారు.

# ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్స్‌తో అప్పుల ఊబి.. యువకుడి బలవన్మరణం

- **క్రెడిట్ కార్డుల అప్పులు తీర్చలేక మనస్తాపం..**
- **గండ్రపల్లిలో విషాదం**

**జమ్మికుంట టౌన్ ఆగస్టు 22 (తెలంగాణ ముచ్చట్లు):** ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్స్‌తో పాటు క్రెడిట్ కార్డుల ద్వారా చేసిన అప్పులు తీర్చలేక మానసికంగా కుంగిపోయిన ఓ యువకుడు బలవన్మరణానికి పాల్పడిన ఘటన గండ్రపల్లి గ్రామంలో విషాదం నింపింది.

పోలీసుల వివరాల ప్రకారం.. గండ్రపల్లి గ్రామానికి చెందిన లింగంపల్లి సంపత్‌రావు కుమారుడు లింగంపల్లి ప్రదీప్‌రావు (30) బీటెక్ పూర్తి చేసి ప్రస్తుతం ఇంటి వద్ద ఉంటున్నాడు. కొంతకాలంగా ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్స్‌తో పాటు వివిధ క్రెడిట్ కార్డుల ద్వారా అప్పులు చేసినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. అప్పులు పెరిగిపోవడంతో వాటిని తీర్చలేక ప్రదీప్‌రావు తీవ్ర మానసిక ఆందోళనకు గురైనట్లు పేర్కొన్నారు.ఈ క్రమంలో ఇంట్లో ఎవరూ లేని సమయంలో తన గదిలో ఉరేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డాడు. అనంతరం విషయం గుర్తించిన కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం అందించారు.



మృతుడి తండ్రి లింగంపల్లి సంపత్‌రావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఘటనకు దారితీసిన పరిస్థితులపై పూర్తి వివరాలను సేకరిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్స్‌కు యువత దూరంగా ఉండాలని, ఆర్థిక ఇబ్బందులు ఎదురైనప్పుడు కుటుంబ సభ్యులు, స్నేహితులు లేదా సంబంధిత నిపుణులను సంప్రదించి సమస్యకు పరిష్కారం కనుగొనాలని సూచిస్తున్నారు.

తెలంగాణ TELANGANA MUCHATLU ముచ్చట్లు
ఎడిటర్: బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక


# మల్లన్నపల్లిలో ఇందిరమ్మ ఇళ్లకు భూమిపూజ



- **ముగ్గురు లబ్ధిదారుల గృహ నిర్మాణ పనులకు శ్రీకారం**

**వీణవంక, ఆగస్టు 22 (తెలంగాణ ముచ్చట్లు):** కరీంనగర్ జిల్లా వీణవంక మండలం మల్లన్నపల్లి గ్రామంలో శనివారం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులకు భూమిపూజ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. గ్రామానికి చెందిన ముగ్గురు లబ్ధిదారులకు మంజూరైన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను గ్రామ సర్పంచ్ కలకొండ సరోజన లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ పేదల సొంతింటి కలను సాకారం చేసేందుకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అర్హులైన లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వం అందిస్తున్న సహకారంతో ఇళ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేసుకునేలా లబ్ధిదారులకు అవసరమైన సహకారం అందిస్తామని తెలిపారు.

భూమిపూజ కార్యక్రమంతో తమ సొంతింటి నిర్మాణానికి శ్రీకారం చుట్టడం పట్ల లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేశారు. ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు మండలం గట్టయ్య, కొమురయ్య, కరుణాకర్, కొండల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్‌లోకి యువత క్యూ



- **జమ్మికుంట 28వ వార్డులో పలువురు యువకుల చేరిక**

**జమ్మికుంట టౌన్, ఆగస్టు 22 (తెలంగాణ ముచ్చట్లు):** జమ్మికుంట పట్టణంలోని 28వ వార్డులో పలువురు యువకులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. కౌన్సిలర్ ఒగ్గు రమేష్ ప్రోత్సాహంతో కాంగ్రెస్ పార్టీ విధానాలు, ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులైన యువకులను పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు సుంకర రమేష్ ఆధ్వర్యంలో పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఒగ్గు రమేష్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోందన్నారు. పార్టీపై నమ్మకం, అభిమానం పెంచుకుని యువత పెద్ద సంఖ్యలో కాంగ్రెస్‌లో చేరుతున్నారని తెలిపారు. 28వ వార్డులో మరింత మంది యువకులు కాంగ్రెస్ పార్టీతో కలిసి ప్రజాసేవలో భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు.

పార్టీలో చేరిన యువకులు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులై పార్టీలో చేరుతున్నట్లు తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారం, వార్డు అభివృద్ధి కోసం నాయకులతో కలిసి పనిచేస్తామని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో 13వ వార్డు కాంగ్రెస్ పార్టీ నాయకుడు ఎగిత అశోక్, వార్డు అధ్యక్షుడు లింగంపల్లి అన్వేష్ తదితరులు పాల్గొన్నారు. పార్టీలో చేరిన వారిలో గాదె శ్రీధర్, లింగంపల్లి అభిలాష్, ఠాకూర్ శివకుమార్, గోగికారి సాయికుమార్, రాంపూర్ణచందర్, రామ్ లక్ష్మణ్, మూడెం రంజిత్, దాసారపు వాసులు తదితరులు ఉన్నారు.

# కష్టకాలంలో కుటుంబానికి అండగా వొడితల ప్రణవ్



- **అనారోగ్యంతో బాధపడుతున్న నేదురి అనిల్‌కు రూ.2.50 లక్షల ఎల్‌ఓసీ అందజేత**

**వీణవంక, ఆగస్టు 22 (తెలంగాణ ముచ్చట్లు):** ఆపదలో ఉన్న కుటుంబానికి అండగా నిలిచి హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్ పెద్దమనసు చాటుకున్నారు. వీణవంక మండలం ఎల్బాక గ్రామానికి చెందిన నేదురి అనిల్ అనారోగ్యానికి గురైన విషయం తెలుసుకున్న ప్రణవ్.. బాధిత కుటుంబానికి ప్రభుత్వం ద్వారా మంజూరైన రూ.2.50 లక్షల విలువైన ఎల్‌ఓసీని స్వయంగా వారి ఇంటికి వెళ్లి అందజేశారు. ఆర్థిక ఇబ్బందులతో వైద్య చికిత్సకు ఇబ్బంది పడుతున్న కుటుంబానికి ఈ సహాయం ఎంతో ఉపయోగపడుతుందని ప్రణవ్ తెలిపారు. అనారోగ్యంతో బాధపడుతున్న అనిల్ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ప్రజలకు ఏ కష్టమొచ్చినా అండగా నిలిచి, అవసరమైన సహాయం అందించేందుకు ఎల్లప్పుడూ ముందుంటామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబ సభ్యులు ప్రణవ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వీణవంక మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# దళిత హక్కుల పోరాట యోధుడికి రాష్ట్ర గుర్తింపు

- **దళితబంధు సాధన సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా కోలుగూరి నరేష్ నియామకం**

**జమ్మికుంట టౌన్, ఆగస్టు 22 (తెలంగాణ ముచ్చట్లు):** దళితబంధు రెండో విడత నిధుల సాధన కోసం నిరంతరం పోరాటం చేస్తున్న జమ్మికుంట పట్టణానికి చెందిన కోలుగూరి నరేష్‌కు రాష్ట్రస్థాయిలో కీలక బాధ్యత దక్కింది. దళితబంధు సాధన సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఆయన నియమితులయ్యారు. ఈ మేరకు సమితి రాష్ట్ర అధ్యక్షుడు కొగిలా మహేష్ శనివారం నరేష్‌కు నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు కొగిలా మహేష్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా దళితబంధు సాధన సమితి కమిటీలను ఏర్పాటు చేసి ఉద్యమాన్ని గ్రామస్థాయి నుంచి మరింత బలోపేతం చేస్తామని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అవలంబిస్తున్న దళిత వ్యతిరేక విధానాలను ప్రజలకు వివరిస్తూ ప్రతి గ్రామంలో విస్తృత ప్రచారం నిర్వహిస్తామన్నారు. దళిత సంఘాలను ఏకతాటిపైకి తీసుకువచ్చి హక్కుల సాధన కోసం ఉద్యమాన్ని మరింత తీవ్రతరం చేస్తామని స్పష్టం చేశారు. నూతనంగా నియమితులైన రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోలుగూరి నరేష్ మాట్లాడుతూ హుజురాబాద్ నియోజకవర్గంలో దళితబంధు రెండో విడత నిధులు మంజూరు చేయాలని గత రెండేళ్లుగా అనేక పోరాటాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దళితబంధు నిధుల కోసం చేపట్టిన పోరాటానికి రాష్ట్రస్థాయిలో గుర్తింపు లభించడం సంతోషంగా ఉందన్నారు. తనకు రాష్ట్రస్థాయిలో పోరాటం చేసే అవకాశం కల్పించిన రాష్ట్ర కమిటీ సభ్యులకు, తన నియామకానికి సహకరించిన రాష్ట్ర అధ్యక్షుడు కొగిలా మహేష్‌కు నరేష్ కృతజ్ఞతలు తెలిపారు. హుజురాబాద్ నియోజకవర్గంతో పాటు రాష్ట్రవ్యాప్తంగా దళితబంధు రెండో విడత నిధుల సాధన, దళితుల హక్కుల పరిరక్షణ కోసం మరింత పట్టుదలతో పనిచేస్తానని ఆయన స్పష్టం చేశారు.



# ప్రగతి ఫలాలు ప్రతి గడపకు.. ప్రతి ఇంటికి అందిస్తాం

- **సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఇంటింటికీ పంపిణీ చేసిన వొడితల ప్రణవ్**

**వీణవంక, ఆగస్టు 22 (తెలంగాణ ముచ్చట్లు):** ప్రజా సంక్షేమం, అభివృద్ధి ఫలాలను ప్రతి గడపకు, ప్రతి ఇంటికి అందించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్ అన్నారు. ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మంజూరైన చెక్కులను లబ్ధిదారుల ఇంటి వద్దకే వెళ్లి పంపిణీ చేశారు.



శనివారం వీణవంక మండలంలోని బేతిగల్, వల్భాపూర్, నర్సింగాపూర్, లస్మక్కపల్లి, వీణవంక, రామకృష్ణాపూర్, కొండపాక, హిమ్మత్‌నగర్, శ్రీరాములపేట, నర్సింహులపల్లి, చల్లూర్, మామిడాలపల్లి, ఎల్బాక, గంగారం, బొంతుపల్లి, ఘన్ముక్ల, మల్లన్నపల్లి గ్రామాల్లో పర్యటించిన ప్రణవ్.. మొత్తం రూ.19 లక్షల విలువైన 49 సీఎంఆర్ఎఫ్ చెక్కులను లబ్ధిదారులకు నేరుగా అందజేశారు. ఇంటింటికీ వెళ్లిన సందర్భంగా గ్రామాల్లోని ప్రజలు తమ సమస్యలను ప్రణవ్ దృష్టికి తీసుకురాగా, వాటి పరిష్కారానికి కృషి చేస్తామని ఆయన హామీ ఇచ్చారు. ఆపద సమయంలో ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ప్రభుత్వం అండగా నిలుస్తోందని లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేస్తూ ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

**కౌశిక్‌రెడ్డి అబద్ధపు ప్రచారాలు మానుకోవాలి**

అనంతరం దేశాయిపల్లి గ్రామంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ప్రణవ్ మాట్లాడుతూ డబుల్ బెడ్‌రూం ఇళ్ల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందన్నారు. మంత్రిగా, ఎమ్మెల్సీగా, విప్‌గా ఉన్న సమయంలో చేయలేని పనులను నియోజకవర్గ ఇంచార్జిగా తాము చేసి చూపించామని, డబుల్ బెడ్‌రూం ఇళ్ల మరమ్మతులకు నిధులు మంజూరు చేయించామని తెలిపారు. కౌశిక్‌రెడ్డి అబద్ధపు ప్రచారాలకు స్వస్తి పలకాలని సూచించారు. ఇప్పటికే అర్హులైన లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు అందజేస్తున్నామని పేర్కొన్నారు. పేదలపై నిజమైన చిత్తశుద్ధి ఉంటే ఎమ్మెల్సీగా ఉన్న సమయంలో లబ్ధిదారులకు ఇళ్లను ఎందుకు పంపిణీ చేయలేదో సమాధానం చెప్పాలని ప్రణవ్ డిమాండ్ చేశారు. సోషల్ మీడియాకు, నిజ జీవితానికి చాలా తేడా ఉంటుందని, వాస్తవాలను ప్రజలు గమనిస్తున్నారని అన్నారు.

లస్మక్కపల్లిలో మధ్యాహ్న భోజనం పరిశీలన లస్మక్కపల్లి గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని ప్రణవ్ సందర్శించి చిన్నారులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందేలా అధికారులు, సిబ్బంది చర్యలు తీసుకోవాలని సూచించారు.

సీఎం విదేశీ పర్యటనను అడ్డుకోవడం రాజకీయ కుట్ర తెలంగాణలో విద్యార్థుల విద్యా ప్రమాణాలను మెరుగుపరిచేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అమెరికా పర్యటనకు వెళ్లాలని భావిస్తే కేంద్ర ప్రభుత్వం అనుమతి ఇవ్వకపోవడం రాజకీయ కుట్రగా ప్రణవ్ అభివర్ణించారు. విదేశాల్లోని విద్యాసంస్థలను పరిశీలించి తెలంగాణ విద్యార్థులకు మరింత మెరుగైన విద్య, మౌలిక వసతులు కల్పించాలనే లక్ష్యంతో సీఎం పర్యటన చేపట్టాలని భావించారని తెలిపారు. తెలంగాణ విద్యాసంస్థలను దేశానికే రోల్‌మోడల్‌గా తీర్చిదిద్దే ప్రయత్నాలను అడ్డుకోవడం సరికాదన్నారు. ఇలాంటి రాజకీయ కుట్రలకు కాంగ్రెస్ ప్రభుత్వం భయపడబోదని, విద్యార్థుల భవిష్యత్ కోసం నిరంతరం పనిచేస్తామని ప్రణవ్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో వీణవంక మండల కాంగ్రెస్ అధ్యక్షుడు రఘుపాల్‌రెడ్డి, సర్పంచుల ఫోరం అధ్యక్షుడు శ్రీనివాస్, వివిధ గ్రామాల సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు సభ్యులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# టీచర్లకు అండగా.. ఎల్కతుర్తిలో భారీ ర్యాలీ

**ఎల్కతుర్తి ఆగస్టు 22 తెలంగాణ ముచ్చట్లు:** నల్లగొండ జిల్లా కొండమల్లేపల్లిలోని నాగార్జున గ్రామర్ కాన్సెప్ట్ స్కూల్ ప్రిన్సిపాల్, డైరెక్టర్ రూపారెడ్డి హత్యను నిరసిస్తూ ఎల్కతుర్తి మండల కేంద్రంలో శనివారం ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు భారీ ర్యాలీ నిర్వహించారు. పోలీస్ స్టేషన్ నుంచి అంబేద్కర్ జంక్షన్ వరకు ప్లకార్డులు, బ్యానర్లు చేతబట్టి శాంతియుతంగా ర్యాలీ చేపట్టారు. రూపారెడ్డి మృతికి నివాళులర్పిస్తూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఎల్కతుర్తి మండల ట్రస్మా అధ్యక్షుడు ఎన్. సుదీర్ మాట్లాడుతూ.. ఉపాధ్యాయుల భద్రతకు ప్రభుత్వం ప్రత్యేక రక్షణ చట్టాన్ని తీసుకురావాలని డిమాండ్ చేశారు. విద్యార్థులను క్రమశిక్షణలో పెట్టే క్రమంలో ఉపాధ్యాయులు సూచనలు,




మందలింపులు చేయడం విద్యాబోధనలో భాగమని, వాటిని నేరపూరిత చర్యలుగా పరిగణించకుండా ఉపాధ్యాయులకు చట్టపరమైన రక్షణ కల్పించాలని కోరారు. టీచర్లు ఎలాంటి భయాందోళనలకు గురికాకుండా విధులు నిర్వహించే వాతావరణాన్ని ప్రభుత్వం కల్పించాలన్నారు.

విద్యార్థుల ప్రవర్తన, సెల్‌ఫోన్ వినియోగం, నగదు వినియోగం తదితర అంశాలపై తల్లిదండ్రులు నిరంతరం పర్యవేక్షణ చేయాలని సూచించారు. పాఠశాల సమయం అనంతరం పిల్లల ప్రవర్తనపై తల్లిదండ్రులు బాధ్యత వహించాలన్నారు. విద్యార్థులకు మాదకద్రవ్యాల దుష్ప్రభావాలు, నైతిక విలువలు, క్రమశిక్షణపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించడంతో పాటు పాఠశాలల్లో కౌన్సెలింగ్ తరగతులు ఏర్పాటు చేయాలని కోరారు.

ఉపాధ్యాయుల భద్రతకు ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని, విద్యా రంగంలో పనిచేసే ప్రతి ఒక్కరికీ రక్షణ కల్పించే విధంగా విధానాలను రూపొందించాలని ర్యాలీలో పాల్గొన్న వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సెయింట్ థామస్ ఆల్టిట్యూడ్ హైస్కూల్, విజ్ఞాన్ స్కూల్, శ్రీ చైతన్య, కార్మెల్ కాన్వెంట్ హైస్కూల్, గోల్డెన్ స్మైల్ స్కూల్, సెంటన్ తదితర పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# బొల్లారం వద్ద అక్రమ ఆయుధాలు పట్టివేత.. నిందితుడి అరెస్ట్







**మేడ్చల్–మల్కాజిగిరి, ఆగస్టు 22 (తెలంగాణ ముచ్చట్లు):** మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా బొల్లారం పోలీస్ స్టేషన్ పరిధిలో అక్రమంగా ఆయుధాలు తరలిస్తున్న వ్యక్తిని ఎస్‌ఓటీ మల్కాజిగిరి జోన్, బొల్లారం లా అండ్ ఆర్డర్ పోలీసులు సంయుక్తంగా అరెస్ట్ చేశారు.

పోలీసుల వివరాల ప్రకారం.. ఉత్తరప్రదేశ్‌కు చెందిన 27 ఏళ్ల పర్భాన్స్ కుమార్ ప్రస్తుతం పటాన్‌చెరువులోని బీహార్ బస్తీలో నివాసం ఉంటూ కూలీగా పనిచేస్తున్నాడు. తక్కువ సమయంలో ఎక్కువ డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో గతంలో డ్రై గంజాయి, గంజాయి చాక్లెట్ల విక్రయానికి పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. ఈ కేసులో 2024లో చెర్లపల్లి పోలీసులు అతడిని అరెస్ట్ చేసినట్లు వెల్లడించారు.


అనంతరం తక్కువ ధరకు తుపాకులు, తపంచాలు కొనుగోలు చేసి హైదరాబాద్‌లో అవసరమైన వారికి అధిక ధరలకు విక్రయించాలని పథకం వేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ క్రమంలో ఈ నెల 10న ఉత్తరప్రదేశ్‌కు వెళ్లిన పర్భాన్స్ కుమార్.. సోను అనే వ్యక్తిని సంప్రదించి ఆయుధాలు కొనుగోలు చేసినట్లు వెల్లడించారు. సోను నుంచి రెండు 9 ఎంఎం పిస్టల్స్, 17 లైవ్ రౌండ్లు, మూడు మ్యాగజైన్లు, ఒక డబుల్ బ్యారెల్ తపంచా, రెండు లైవ్ రౌండ్లు కొనుగోలు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ఆగస్టు 22న మధ్యాహ్నం 12:10 గంటల సమయంలో బొల్లారం బంగ్లా నంబర్ 13, సాధన మందిర్ సమీపంలో పర్భాన్స్ కుమార్ ఉన్నట్లు విశ్వసనీయ సమాచారం అందడంతో ఎస్‌ఓటీ మల్కాజిగిరి జోన్ పోలీసులు, బొల్లారం పోలీసులు సంయుక్తంగా దాడి చేసి అతడిని అదుపులోకి తీసుకున్నారు.

అతని వద్ద నుంచి రెండు 9 ఎంఎం పిస్టల్స్, మూడు మ్యాగజైన్లు, 17 లైవ్ రౌండ్లు, ఒక డబుల్ బ్యారెల్ తపంచా, రెండు లైవ్ రౌండ్లను స్వాధీనం చేసుకున్నారు.

అక్రమ ఆయుధాలను కొనుగోలు చేసి నేరాలకు పాల్పడే వ్యక్తులకు విక్రయించేందుకు ప్రయత్నించిన పర్భాన్స్ కుమార్‌పై బొల్లారం పోలీస్ స్టేషన్‌లో ఆర్మ్స్ యాక్ట్ కింద కేసు నమోదు చేశారు. ఈ వ్యవహారంపై పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

తెలంగాణ ముచ్చట్లు TELANGANA MUCHATLU
ఎడిటర్: బొల్లిపాక రాజేష్
తెలుగు దిన పత్రిక




# ఒడిశా నుంచి తెలంగాణకు హషీష్ ఆయిల్ ఇద్దరి అరెస్ట్

**మల్కాజిగిరి, ఆగస్టు 22 (తెలంగాణ ముచ్చట్లు):** మల్కాజిగిరి కమిషనరేట్ పరిధిలో భారీగా హషీష్ ఆయిల్ పట్టుబడింది. ఒడిశా నుంచి తెలంగాణకు అక్రమంగా తరలిస్తున్న 14.2 కిలోల హషీష్ ఆయిల్‌ను ఎల్‌బీనగర్ ఎస్ఓటీ, నాగోల్ పోలీసులు సంయుక్తంగా స్వాధీనం చేసుకున్నారు. దీని విలువ సుమారు రూ.1.75 కోట్లు ఉంటుందని పోలీసులు వెల్లడించారు. నాగోల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని గౌరెల్లి రోడ్డుపై పోలీసులు వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా.. యమహా ఎంటీ15 బైక్‌పై హషీష్ ఆయిల్ తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. అరెస్టైన వారిని అల్లూరి సీతారామరాజు జిల్లాకు చెందిన తల్లే నాగరాజు, నాగుల నారాయణ అలియాస్ కిరణ్‌గా పోలీసులు గుర్తించారు. వీరిద్దరూ పెడ్లర్ కమ్ ట్రాన్స్‌పోర్టర్లుగా వ్యవహరిస్తున్నట్లు తెలిపారు.
తనిఖీల్లో నిందితుల వద్ద నుంచి 14 ప్యాకెట్లలో 14.2 కిలోల హషీష్ ఆయిల్, రెండు మొబైల్ ఫోన్లు, యమహా ఎంటీ15 బైక్, రూ.2,500 నగదు స్వాధీనం చేసుకున్నారు. విచారణలో కీలక విషయాలు వెలుగులోకి వచ్చినట్లు పోలీసులు తెలిపారు. ఒడిశాలోని మల్కన్‌గిరి జిల్లాకు చెందిన తమరా గోపాల్ అనే వ్యక్తి.. నాగరాజు, నారాయణలకు చెరో 7 కిలోల హషీష్ ఆయిల్ ఉన్న రెండు బ్యాగులను అందించినట్లు వెల్లడైంది. ఒడిశా నుంచి హైదరాబాద్‌కు తరలించి అప్పగిస్తే ఒక్కొక్కరికి రూ.లక్ష చొప్పున ఇస్తానని గోపాల్ ఆఫర్ చేసినట్లు పోలీసులు తెలిపారు.
పోలీసుల తనిఖీలను తప్పించుకునేందుకు గ్రామీణ రహదారుల మీదుగా హైదరాబాద్‌కు వస్తుండగా.. నాగోల్ పోలీసులు వీరిని పట్టుకున్నారు.
నిందితులకు గతంలో కూడా గంజాయి కేసుల్లో ప్రమేయం ఉన్నట్లు పోలీసులు వెల్లడించారు. ప్రధాన సరఫరాదారు తమరా గోపాల్ ప్రస్తుతం పరారీలో ఉన్నాడని.. అతడి కోసం గాలింపు కొనసాగుతోందని తెలిపారు.
ఈ ఘటనపై నాగోల్ పోలీస్ స్టేషన్‌లో ఎన్‌డీపీఎస్ చట్టం కింద కేసు నమోదు చేసి, హషీష్ ఆయిల్ సరఫరా వెనుక ఉన్న మొత్తం నెట్‌వర్క్‌పై పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.



# వేలేరు మండల కేంద్రంలో డిజిటల్ స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

**వేలేరు, ఆగస్టు 22 (తెలంగాణ ముచ్చట్లు):** వేలేరు మండల కేంద్రంలోని రైతు వేదికలో నిర్వహించిన డిజిటల్ స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమానికి ఎమ్మెల్యే కడియం శ్రీహరి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం అత్యంత భద్రతా ప్రమాణాలతో జారీ చేసిన డిజిటల్ స్మార్ట్ రేషన్ కార్డులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు.
ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ కార్యక్రమాలను చూసి ఓర్వలేక బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్ ప్రభుత్వంపై తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని ఆరోపించారు. ఇటీవల ఆదిలాబాద్‌లో జరిగిన ఓ సంఘటనను తనకు సంబంధించినదిగా సోషల్ మీడియాలో ప్రచారం చేయడం దిగజారుడు రాజకీయాలకు నిదర్శనమని విమర్శించారు. కొన్ని యూట్యూబ్ ఛానళ్ల ద్వారా కాంగ్రెస్ ప్రభుత్వం, నాయకులపై అసత్య ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు.
తన 35 ఏళ్ల రాజకీయ జీవితంలో ఎప్పుడూ అవినీతికి పాల్పడలేదని స్పష్టం చేసిన ఆయన, ప్రజల సంక్షేమం మరియు నియోజకవర్గ అభివృద్ధే తన లక్ష్యమని పేర్కొన్నారు. దేశంలోనే తొలిసారిగా సన్న బియ్యంతో పాటు డిజిటల్ స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేసిన రాష్ట్రం తెలంగాణేనని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఏడాదికి రూ.13,800 కోట్ల వ్యయంతో కోటి 6 లక్షల రేషన్ కార్డుల ద్వారా 3 కోట్ల 10 లక్షల మందికి ఒక్కొక్కరికి 6 కిలోల చొప్పున ఉచిత సన్న బియ్యం అందజేస్తోందని తెలిపారు.
రేషన్ కార్డులపై ప్రధాని నరేంద్ర మోదీ ఫొటో ముద్రించాలని బీజేపీ నాయకులు కోరడం సరికాదని వ్యాఖ్యానించారు. కేంద్ర ప్రభుత్వం దొడ్డు బియ్యం ఇస్తుంటే, రాష్ట్ర ప్రభుత్వం సన్న బియ్యం పంపిణీ చేస్తోందని, రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలకు కేంద్ర నాయకుల ఫొటోలు ఎందుకు పెట్టాలని ప్రశ్నించారు. పేదల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు.
వేలేరు కొత్త మండలంగా ఏర్పడిన తర్వాత మూడు ప్రధాన సమస్యల పరిష్కారంపై దృష్టి సారించామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. మల్లన్నగండి రిజర్వాయర్ నుంచి సాగునీరు అందించే లక్ష్యంతో లిఫ్ట్1 పనులు వేగంగా కొనసాగుతున్నాయని, త్వరలోనే గోదావరి జలాలను వేలేరుకు తీసుకువస్తామని హామీ ఇచ్చారు. తహసీల్దార్ కార్యాలయ నిర్మాణానికి రూ.2.25 కోట్లు మంజూరయ్యాయని, ఎంపీడీవో కార్యాలయానికి మరో రూ.2 కోట్లు త్వరలో మంజూరు కానున్నాయని తెలిపారు. నెల రోజులలోపు మండల కార్యాలయాల నిర్మాణానికి శంకుస్థాపన చేస్తామని వెల్లడించారు.
వేలేరు నుండి కొమ్ముగుట్ట వరకు రహదారి అభివృద్ధికి పంచాయతీ రాజ్ హ్యామ్ పథకం కింద రూ.14 కోట్లు మంజూరయ్యాయని, త్వరలో పనులు పూర్తి చేస్తామని తెలిపారు. అలాగే వేలేరు మండల కేంద్రంలో అసంపూర్తిగా ఉన్న ప్రధాన రహదారి పనులను కూడా పూర్తి చేయనున్నట్లు చెప్పారు. సాగునీరు, మండల కార్యాలయాలు, రోడ్డు పనులు పూర్తి చేయకపోతే తిరిగి కాంగ్రెస్ పార్టీకి ఓట్లు అడగనని స్పష్టం చేశారు.
ఈ కార్యక్రమంలో మండలంలోని సర్పంచులు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, ప్రజాప్రతినిధులు, రేషన్ డీలర్లు, కాంగ్రెస్ నాయకులు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

# బోనాల వేళ బాలాజీనగర్‌లో పారిశుద్ధ్యంపై ప్రజల ఆవేదన



**జవహర్‌నగర్, ఆగస్టు 22 (తెలంగాణ ముచ్చట్లు):** మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా, కీసర సర్కిల్ పరిధిలోని జవహర్‌నగర్ బాలాజీనగర్‌లో బోనాల పండుగకు గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు ఏర్పాట్లు చేశారు. పండుగ సందర్భంగా పరిసరాలను అలంకరించి, పైపై మెరుగులు దిద్దినప్పటికీ.. కాలనీల్లో పారిశుద్ధ్య పరిస్థితులు మాత్రం అందుకు భిన్నంగా ఉన్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.
ప్రతి కాలనీలో ఇంటింటి నుంచి చెత్త సేకరించి తరలించేందుకు సరిపడా సిబ్బంది లేకపోవడంతో రోడ్లపై చెత్త పేరుకుపోతోందని ప్రజలు చెబుతున్నారు. ఒకవైపు పండుగ వాతావరణం నెలకొంటే.. మరోవైపు రోడ్లపై పేరుకుపోయిన చెత్తతో కాలనీలు కంపుకొడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.
ముఖ్యంగా సుక్కమగుంట ప్రాంతంలో పారిశుద్ధ్య పరిస్థితులు మరింత దయనీయంగా ఉన్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. రోడ్ల వెంట చెత్తాచెదారం పేరుకుపోయి ప్రజలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని చెబుతున్నారు. పండుగ సమయంలోనైనా పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టిసారించి చెత్తను వెంటనే తొలగించాలని, అదనపు సిబ్బందిని ఏర్పాటు చేసి కాలనీలను పరిశుభ్రంగా ఉంచాలని స్థానికులు జీహెచ్ఎంసీ అధికారులను కోరుతున్నారు.
పండుగకు పైపై అలంకరణలు కాదు.. ప్రజలకు పరిశుభ్రమైన వాతావరణం కల్పించడమే అసలు అవసరమని స్థానికులు పేర్కొంటున్నారు.

# కలం కదిలితే.. గళం గర్జిస్తే ఆపగలరా?

- ఏడో రోజుకు చేరిన రిలే దీక్షలు.. అంబేద్కర్ చౌరస్తాలో అర్ధనగ్న నిరసన



**హుజూరాబాద్, ఆగస్టు 22 (తెలంగాణ ముచ్చట్లు):** అర్హులైన జర్నలిస్టులకు వెంటనే ఇళ్ల స్థలాలు కేటాయించి న్యాయం చేయాలని, కోర్టులో దాఖలు చేసిన కేసులను బేషరతుగా ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ హుజూరాబాద్ అంబేద్కర్ చౌరస్తాలో జర్నలిస్టులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు శనివారం ఏడో రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా జర్నలిస్టులు అర్ధనగ్న ప్రదర్శన నిర్వహించి తమ నిరసనను వ్యక్తం చేశారు. కాంగ్రెస్ నాయకుడు గూడూరు స్వామిరెడ్డి వైఖరికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.
జర్నలిస్టుల ఇళ్ల స్థలాల విషయంలో దాఖలు చేసిన పిటిషన్‌ను వెంటనే ఉపసంహరించుకోవాలని, స్థలాల కేటాయింపునకు అడ్డంకులు సృష్టించే ప్రయత్నాలను విరమించుకోవాలని వారు డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్యానికి నాలుగో స్తంభంగా నిలుస్తున్న జర్నలిస్టులు తమ న్యాయమైన హక్కుల కోసం రోడ్డెక్కాల్సిన పరిస్థితి రావడం బాధాకరమన్నారు. సమస్యను పరిష్కరించడంలో మరింత జాప్యం చేస్తే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.
జర్నలిస్టుల పోరాటానికి బీసీ జేఏసీ సంపూర్ణ మద్దతు
జర్నలిస్టుల దీక్షా శిబిరాన్ని బీసీ జేఏసీ గౌరవాధ్యక్షులు చందుపట్ల జనార్దన్ సందర్శించి సంపూర్ణ సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజ హితం కోసం నిరంతరం శ్రమించే జర్నలిస్టుల కలం కదిలినా.. గళం గర్జించినా ఆ శక్తిని ఏ శక్తీ తట్టుకోలేదన్నారు. ప్రజా సమస్యలపై నిత్యం పోరాడే విలేకరులు నేడు తమ కనీస హక్కుల కోసం రోడ్డెక్కడం ప్రజాస్వామ్యానికే అవమానకరమన్నారు. జర్నలిస్టుల ఇళ్ల స్థలాల సమస్యను బయట విమర్శలు, ఆరోపణలతో మరింత జటిలం చేయకుండా అధికారిక వేదికపై చర్చించి పరిష్కరించుకోవాలని సూచించారు. గతంలో జటిలంగా మారిన డంప్‌యార్డ్ సమస్యను ప్రజాప్రతినిధులు సమష్టిగా చొరవ తీసుకుని పరిష్కరించిన విధంగానే జర్నలిస్టుల స్థలాల సమస్యను కూడా నియోజకవర్గ స్థాయి నాయకులు, ప్రజాప్రతినిధులు ముందుకు వచ్చి వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు.
స్థలాల కేటాయింపులో ఏవైనా చిన్నచిన్న సాంకేతిక లోపాలు ఉంటే వాటిని జర్నలిస్టులే సరిదిద్దుకునేందుకు సిద్ధంగా ఉన్నారని జనార్దన్ తెలిపారు. సమస్య పూర్తిగా పరిష్కారమయ్యే వరకు బీసీ జేఏసీ జర్నలిస్టులకు అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.
ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా కార్యదర్శి వీరస్వామి, మండల కార్యదర్శి కోయల్‌కార్ దుర్గాజీ, ప్రొఫెసర్ తడకమళ్ల శేఖర్, బీసీ జేఏసీ అధ్యక్షులు సందెల వెంకన్న, ఇప్పకాయల సాగర్, మామునూరి ప్రవీణ్, దేవస్థానం ప్రియదర్శిని, సంఘం సత్యనారాయణ, పంజాల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొని జర్నలిస్టుల పోరాటానికి మద్దతు ప్రకటించారు. పెద్ద సంఖ్యలో జర్నలిస్టులు దీక్షలో పాల్గొన్నారు.

# అహల్యనగర్ రోడ్డు గుంతలకు తాత్కాలిక పరిష్కారం

- తెలంగాణ ముచ్చట్లు కథనానికి స్పందించిన అధికారులు..
- మొరం, మట్టితో గుంతల పూడ్చివేత.. సీసీ రోడ్డు నిర్మాణానికి స్థానికుల డిమాండ్


అహల్యానగర్ రోడ్లు అధ్వానం.. ప్రజలకు నరకయాతన
తెలంగాణ ముచ్చట్లు TELANGANA MUCHATLU
08 Aug 2026-08 Aug 2026 - Page 3

**తెలంగాణ ముచ్చట్లు స్పందన**

**హుజూరాబాద్,ఆగస్టు 22(తెలంగాణ ముచ్చట్లు ):** అహల్యనగర్‌లో గుంతలు, బురదమయంగా మారిన రోడ్డుతో ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై తెలంగాణ ముచ్చట్లులో ప్రచురితమైన కథనానికి మున్సిపల్ అధికారులు స్పందించారు. రోడ్డు పరిస్థితిపై వచ్చిన వార్తను పరిగణనలోకి తీసుకున్న అధికారులు వెంటనే స్పందించి గుంతలను తాత్కాలికంగా మొరం, మట్టి పోసి పూడ్చే చర్యలు చేపట్టారు. దీంతో రోడ్డుపై గుంతలు కొంతమేర పూడ్చబడటంతో వాహనదారులు, స్థానికులకు రాకపోకల్లో ఇబ్బందులు తగ్గాయి. ఇటీవల కురిసిన వర్షాల కారణంగా అహల్యనగర్‌లోని రోడ్డు పూర్తిగా బురదమయంగా మారడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. రోడ్డుపై పెద్ద ఎత్తున గుంతలు ఏర్పడటంతో ద్విచక్ర వాహనదారులు, ఆటోలు, ఇతర వాహనాలు వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్న పరిస్థితి నెలకొంది. వర్షం సమయంలో గుంతల్లో నీరు నిలిచి అవి కనిపించకపోవడంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సమస్యను తెలంగాణ ముచ్చట్లు వెలుగులోకి తీసుకురావడంతో అధికారులు స్పందించి తాత్కాలికంగా గుంతలను పూడ్చడం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రజల సమస్యలను వార్తల రూపంలో వెలుగులోకి తీసుకురావడం ద్వారా అధికారులు స్పందించేలా చేసిన తెలంగాణ ముచ్చట్లుకు స్థానికులు అభినందనలు తెలిపారు. అయితే గుంతలను మొరం, మట్టితో పూడ్చడం తాత్కాలిక ఉపశమనం మాత్రమేనని స్థానికులు పేర్కొన్నారు. వర్షాలు కురిసినప్పుడు మళ్లీ రోడ్డు దెబ్బతినే అవకాశం ఉందని, సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాల్సిన అవసరం ఉందన్నారు. అహల్యనగర్‌లో ప్రజల రాకపోకలకు అనుకూలంగా నాణ్యమైన సీసీ రోడ్డు నిర్మాణాన్ని వీలైనంత త్వరగా చేపట్టాలని వారు మున్సిపల్ అధికారులను కోరుతున్నారు. ఈ సందర్భంగా వార్డు కౌన్సిలర్ వజ్జపెల్లి రాజు మాట్లాడుతూ.. అహల్యనగర్ రోడ్డు సమస్యను మున్సిపల్ చైర్మన్ దృష్టికి తీసుకెళ్లి, శాశ్వత పరిష్కారం కోసం సీసీ రోడ్డు నిర్మాణం జరిగేలా చర్యలు తీసుకుంటానని తెలిపారు. ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు. తాత్కాలికంగా గుంతలు పూడ్చడంతో



కొంత ఊరట లభించినప్పటికీ, సీసీ రోడ్డు నిర్మాణం పూర్తయితేనే అహల్యనగర్ ప్రజల రోడ్డు సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని స్థానికులు పేర్కొన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో వీలైనంత త్వరగా పనులు ప్రారంభించి పూర్తి చేయాలని వారు కోరుతున్నారు.

# అర్బన్ మేడ్చల్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు గిరివర్ధన్ రెడ్డికి ఘన సన్మానం

**కాప్రా, ఆగస్టు 22 (తెలంగాణ ముచ్చట్లు):** అర్బన్ మేడ్చల్ జిల్లా బీజేపీ అధ్యక్షుడిగా ఎన్నికైన గిరివర్ధన్ రెడ్డిని కాప్రా బీజేపీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు.
నూతన బాధ్యతల్లో గిరివర్ధన్ రెడ్డి విజయవంతంగా రాణించి పార్టీని మరింత బలోపేతం చేయాలని నాయకులు ఆకాంక్షించారు. ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం ఇస్తూ.. పార్టీ కార్యకర్తలను సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగాలని కోరారు. ఈ సందర్భంగా గిరివర్ధన్ రెడ్డికి శాలువా కప్పి ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కలిసికట్టుగా పనిచేయాలని నాయకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ బీజేపీ నాయకులు అంబికా, విజయ్, వినోద్, నిశాంత్‌తో పాటు పలువురు బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



TELANGANA MUCHATLU
తెలంగాణ ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక



# ఆయిల్‌ఫామ్ సాగుతో రైతులకు అధిక ఆదాయం

**సిద్దిపేట, ఆగస్టు 22 (తెలంగాణ ముచ్చట్లు):**



సిద్దిపేట జిల్లా నర్మెటలోని ఆయిల్‌ఫామ్ ఫ్యాక్టరీని మాజీ మంత్రులు హరీశ్ రావు, వి. ప్రశాంత్ రెడ్డి శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఫ్యాక్టరీ కార్యకలాపాలు, ఉత్పత్తి సామర్థ్యం, రైతులకు అందిస్తున్న సేవలపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. అనంతరం మాట్లాడిన హరీశ్ రావు, ఆయిల్‌ఫామ్ సాగు రైతులకు లాభదాయకమైన పంటగా నిలుస్తోందని పేర్కొన్నారు. తక్కువ ఖర్చుతో స్థిరమైన ఆదాయం అందించే ఈ పంటను మరింత విస్తరించాల్సిన అవసరం ఉందన్నారు.

కాళేశ్వరం జలాల అందుబాటుతో సిద్దిపేట ప్రాంతంలో ఆయిల్‌ఫామ్ సాగుకు నాంది పలికిన విషయాన్ని హరీశ్ రావు గుర్తు చేశారు. సాగునీటి సౌకర్యాలు పెరగడంతో రైతులు ప్రత్యామ్నాయ వాణిజ్య పంటల వైపు అడుగులు వేస్తున్నారని తెలిపారు. ఆయిల్‌ఫామ్ సాగు ద్వారా రైతుల ఆదాయంలో గణనీయమైన పెరుగుదల నమోదవుతోందని పేర్కొన్నారు. రాష్ట్రంలో ఆయిల్‌ఫామ్ విస్తరణకు గతంలో తీసుకున్న చర్యలు ఇప్పుడు ఫలితాల రూపంలో కనిపిస్తున్నాయని అన్నారు. నర్మెట ఆయిల్‌ఫామ్ ఫ్యాక్టరీ అనతికాలంలోనే 60 వేల మెట్రిక్ టన్నుల క్రషింగ్ పూర్తి చేయడం గొప్ప విజయమని హరీశ్ రావు అభిప్రాయపడ్డారు. ఇది ఫ్యాక్టరీ సామర్థ్యానికి, రైతుల సహకారానికి నిదర్శనమని చెప్పారు. రైతులు పండించిన పంటకు మార్కెట్ భరోసా కల్పించడంలో ఫ్యాక్టరీ కీలక పాత్ర పోషిస్తోందని పేర్కొన్నారు. ఈ విజయంతో మరింత మంది రైతులు ఆయిల్‌ఫామ్ సాగుపై ఆసక్తి చూపే అవకాశం ఉందన్నారు. ఆయిల్‌ఫెడ్ అధికారులు రిఫైనరీ పనులను వెంటనే ప్రారంభించాలని హరీశ్ రావు సూచించారు. రిఫైనరీ అందుబాటులోకి వస్తే విలువ ఆధారిత ఉత్పత్తులకు మరింత ప్రోత్సాహం లభిస్తుందని చెప్పారు. అలాగే ప్రస్తుతం అందుబాటులో ఉన్న ఆయిల్‌ఫామ్ మొక్కలను రైతులకు వేగంగా పంపిణీ చేసి సాగు విస్తీర్ణాన్ని పెంచాలని సూచించారు. కొత్తగా సాగు చేపట్టే రైతులకు ప్రత్యేక ప్రోత్సాహకాలు కల్పించాలని కోరారు.

రైతులకు సాంకేతిక సహాయం అందించడం కూడా అత్యంత ముఖ్యమని హరీశ్ రావు పేర్కొన్నారు. సాగులో ఎదురయ్యే సమస్యలపై ఎప్పటికప్పుడు మార్గదర్శకత్వం ఇవ్వాలని, వ్యవసాయ నిపుణులు, ఫ్యాక్టరీ అధికారులు రైతులకు అందుబాటులో ఉండాలని సూచించారు. పంట నిర్వహణ, దిగుబడి పెంపు, వ్యాధి నివారణ వంటి అంశాల్లో రైతులకు నిరంతర శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు. రైతులకు లాభదాయకమైన పంటలను ప్రోత్సహించి వారి ఆదాయం పెంచడమే లక్ష్యంగా పనిచేయాలని హరీశ్ రావు పిలుపునిచ్చారు. వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు ప్రభుత్వం, అధికారులు, రైతులు సమన్వయంతో ముందుకు సాగాలని అన్నారు. నర్మెట ఫ్యాక్టరీ రాష్ట్రంలో ఆయిల్‌ఫామ్ రంగానికి ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షిస్తూ రైతుల సంక్షేమమే ప్రధాన ధ్యేయమని పేర్కొన్నారు.

# రోడ్లు, వంతెనల పనుల్లో వేగం పెంచాలి

**హైదరాబాద్, ఆగస్టు 22 (తెలంగాణ ముచ్చట్లు):**



రాష్ట్ర వ్యాప్తంగా చేపడుతున్న సీఆర్ఐఎఫ్ రోడ్లు, సేతుబంధన్ వంతెనలు, రైల్వే ఓవర్ బ్రిడ్జిల నిర్మాణ పనుల్లో మరింత వేగం పెంచాలని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అధికారులను ఆదేశించారు. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో శనివారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో మంత్రి శాఖ పనుల పురోగతిని విస్తృతంగా పరిశీలించారు. రాష్ట్ర అభివృద్ధికి రహదారులే కీలకమని పేర్కొంటూ ప్రతి పనిని నిర్ణీత గడువులో పూర్తి చేయాలని స్పష్టం చేశారు. జిల్లాల వారీగా జరుగుతున్న పనుల స్థితిగతులను పరిశీలించిన మంత్రి, క్షేత్రస్థాయిలో అధికారులు మరింత చురుకుగా వ్యవహరించాలని సూచించారు. సచివాలయం ప్రాంగణంలో ఏర్పాటు చేస్తున్న సోలార్ కార్ పార్కింగ్ పనులపై మంత్రి ప్రత్యేక దృష్టి సారించారు. ఉత్తరం, దక్షిణం, పడమర వైపులా ఏర్పాటు చేస్తున్న ఈ ప్రాజెక్టు పనులను 2026 డిసెంబర్ నాటికి పూర్తి చేయాలని ఆదేశించారు. సుమారు రూ.26.81 కోట్ల వ్యయంతో చేపట్టిన ఈ ప్రాజెక్టు పూర్తయితే సచివాలయ అవసరాలకు నెలకు 90 వేల యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి అవుతుందని తెలిపారు. దీనివల్ల నెలవారీ విద్యుత్ బిల్లులో దాదాపు 16 శాతం వరకు ఆదా సాధ్యమవుతుందని పేర్కొన్నారు. భవనం అందాన్ని దెబ్బతీయకుండా ఆధునిక నమూనాలో పనులు చేపట్టాలని అధికారులకు సూచించారు.

రాష్ట్రంలో ఇప్పటివరకు సీఆర్ఐఎఫ్ పథకం కింద 3,918 కిలోమీటర్ల రహదారులకు రూ.5,159 కోట్లతో 316 పనులు మంజూరు చేసినట్లు మంత్రి వెల్లడించారు. వీటిలో అనేక పనులు చివరి దశకు చేరుకోగా, మరికొన్ని ప్రారంభానికి సిద్ధంగా ఉన్నాయని చెప్పారు. 202526 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రూ.868 కోట్లతో చేపట్టిన 422.36 కిలోమీటర్ల రహదారి పనుల పురోగతి సంతృప్తికరంగా ఉందని అధికారులను అభినందించారు. అయితే ప్రజలకు మరింత మెరుగైన రహదారులు అందించాలంటే పనుల్లో వేగం, నాణ్యత రెండూ సమానంగా ఉండాలని స్పష్టం చేశారు. సేతుబంధన్ పథకం కింద నిర్మిస్తున్న వంతెనల పురోగతిపైనా మంత్రి సమీక్ష నిర్వహించారు. రూ.76 కోట్లతో నిర్మిస్తున్న నార్కట్‌పల్లి వంతెన పనులు వేగంగా కొనసాగుతున్నాయని సంతృప్తి వ్యక్తం చేశారు. అలాగే మిర్యాలగూడ, నంది పహాడ్ ప్రాంతాల్లో చేపట్టనున్న వంతెన పనులను తక్షణమే ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు. సాంకేతిక అనుమతులు, భూసేకరణ వంటి అంశాలను త్వరితగతిన పూర్తి చేసి పనులు ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. స్థానిక ప్రజాప్రతినిధులతో సమన్వయం పెంచి ప్రాజెక్టులను ముందుకు తీసుకెళ్లాలని పేర్కొన్నారు.

రైల్వే ఓవర్ బ్రిడ్జిల నిర్మాణంపై కూడా మంత్రి ప్రత్యేక దృష్టి సారించారు. ఇప్పటికే పురోగతిలో ఉన్న ఆర్ఓబీ పనులను నిర్ణీత గడువులో పూర్తి చేయాలని ఆదేశించారు. ఆలస్యాల వల్ల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని గుర్తుచేస్తూ పనుల పర్యవేక్షణను మరింత కట్టుదిట్టం చేయాలని సూచించారు. కరీంనగర్, మెదక్, నల్లగొండ, ఖమ్మం, మహబూబ్‌నగర్, వికారాబాద్, నిజామాబాద్, సిద్దిపేట, మహబూబాబాద్, రంగారెడ్డి జిల్లాల్లో జరుగుతున్న పనులపై అధికారులు వివరాలు అందించారు. ప్రతి జిల్లాలో పురోగతి నివేదికలను క్రమం తప్పకుండా సమీక్షిస్తామని మంత్రి తెలిపారు. ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు అందించడమే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి స్పష్టం చేశారు. రహదారులు, వంతెనలు, ఆర్ఓబీలు సమయానికి పూర్తైతే రవాణా వ్యవస్థ బలోపేతం కావడంతో పాటు ప్రాంతీయ అభివృద్ధికి ఊతమిస్తాయని పేర్కొన్నారు. అధికారులు క్షేత్రస్థాయిలో మరింత శ్రద్ధతో పని చేసి ప్రభుత్వ లక్ష్యాలను సాకారం చేయాలని సూచించారు. నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ ఉండబోదని హెచ్చరిస్తూ ప్రజల అవసరాలకు అనుగుణంగా మౌలిక వసతుల అభివృద్ధి కొనసాగుతుందని తెలిపారు.

# పవర్‌ఫుల్ తెలంగాణకు విద్యుత్ బాట

- **విద్యుత్ రంగ బలోపేతానికి భారీ ప్రణాళికలు**
- **- పవర్ ఎగ్జిబిషన్–2026కు భట్టి శ్రీకారం**
- **2047 లక్ష్యాలకు విద్యుత్ రంగమే వెన్నెముక**
- **ఆధునిక సాంకేతికతతో వినియోగదారులకు మెరుగైన సేవలు**
- **- ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క**

**హైదరాబాద్, ఆగస్టు 22 (తెలంగాణ ముచ్చట్లు):**



తెలంగాణను విద్యుత్ కొరతలేని శక్తివంతమైన రాష్ట్రంగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని ఉప ముఖ్యమంత్రి, విద్యుత్ మరియు ఆర్థిక శాఖల మంత్రి మల్లు భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. రాష్ట్ర భవిష్యత్ ఆర్థికాభివృద్ధికి విద్యుత్ రంగం కీలకమని పేర్కొంటూ, పెరుగుతున్న అవసరాలకు అనుగుణంగా పకడ్బందీ ప్రణాళికలతో ముందుకు సాగుతున్నామని తెలిపారు. టీజీఎస్పీడీసీఎల్ ఆధ్వర్యంలో హైదరాబాద్ నెక్లెస్ రోడ్‌లోని పీపుల్స్ ప్లాజాలో నిర్వహిస్తున్న పవర్ ఎగ్జిబిషన్-2026ను శనివారం ప్రారంభించిన ఆయన, విద్యుత్ రంగంలో తెలంగాణ సాధిస్తున్న పురోగతిని దేశానికి ఆదర్శంగా నిలబెట్టే దిశగా చర్యలు కొనసాగుతున్నాయని చెప్పారు. మూడు రోజుల పాటు జరిగే ఈ ఎగ్జిబిషన్‌లో విద్యుత్ రంగానికి సంబంధించిన ఆధునిక పరికరాలు, సాంకేతిక పరిజ్ఞానం, భద్రతా ప్రమాణాలు, వినియోగదారుల సేవలు, విద్యుత్ సంస్థల విజయాలను ప్రతిబింబించే ప్రత్యేక స్టాళ్లను ఉప ముఖ్యమంత్రి పరిశీలించారు. టీజీఎస్పీడీసీఎల్ రూపొందించిన ప్రత్యేక మస్కట్‌ను ఆవిష్కరించడంతో పాటు సంస్థ విజయాలు, సంస్కరణలు, ప్రజలకు అందిస్తున్న సేవలపై రూపొందించిన బ్రోచర్లను విడుదల చేశారు. విద్యుత్ రంగంలో జరుగుతున్న మార్పులను ప్రజలకు చేరవేయడంలో ఇటువంటి ప్రదర్శనలు కీలక పాత్ర పోషిస్తాయని ఆయన పేర్కొన్నారు.

ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడిన భట్టి విక్రమార్క, తెలంగాణను 2047 నాటికి మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోందని తెలిపారు. పరిశ్రమలు, వ్యవసాయం, సేవారంగం అభివృద్ధి చెందాలంటే నిరంతర విద్యుత్ సరఫరా అత్యవసరమని అన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో విద్యుత్ డిమాండ్ 18 వేల మెగావాట్లకు పైగా పెరిగినా, ముందస్తు ప్రణాళికలు, బలమైన ప్రసార మరియు పంపిణీ వ్యవస్థల వల్ల ఎక్కడా అంతరాయం లేకుండా విద్యుత్ అందిస్తున్నామని వెల్లడించారు. భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని థర్మల్, సోలార్, జలవిద్యుత్, పంప్డ్ స్టోరేజ్, బ్యాటరీ స్టోరేజ్ ప్రాజెక్టులపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోందని తెలిపారు. వినియోగదారుల సేవలను మరింత మెరుగుపర్చేందుకు 1912 టోల్ ఫ్రీ సేవలు, పవర్ అంబులెన్స్ వ్యవస్థ, డిజిటల్ సాంకేతికత ఆధారిత సేవలను విస్తృతంగా అమలు చేస్తున్నామని ఉప ముఖ్యమంత్రి వివరించారు. ప్రజలు ఎదుర్కొనే సమస్యలను వేగంగా పరిష్కరించేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని తెలిపారు. విద్యుత్ రంగంలో పారదర్శకత, సేవల నాణ్యత, భద్రతా ప్రమాణాలను మరింత పెంచడం ద్వారా వినియోగదారుల విశ్వాసాన్ని బలోపేతం చేస్తున్నామని పేర్కొన్నారు.

విద్యుత్ శాఖ ముఖ్య కార్యదర్శి నవీన్ మిట్టల్ మాట్లాడుతూ, రాష్ట్రంలో అధిక పీక్ డిమాండ్ ఉన్న సమయంలో కూడా నిరంతరాయంగా విద్యుత్ సరఫరా అందిస్తున్న విద్యుత్ సంస్థల పనితీరు ప్రశంసనీయమని అన్నారు. టీజీఎస్పీడీసీఎల్ చేపడుతున్న "వాక్ అలోంగ్ ది లైన్", "బస్తీబాట", "ప్రజాబాట" వంటి కార్యక్రమాలు ప్రజలకు మరింత చేరువవుతున్నాయని తెలిపారు. గ్రీన్ ఎనర్జీ కార్యక్రమాల విస్తరణతో తెలంగాణ విద్యుత్ రంగంలో కొత్త ప్రమాణాలను నెలకొల్పుతోందని పేర్కొన్నారు. టీజీఎస్పీడీసీఎల్, టీజీఎన్‌పీడీసీఎల్ సంస్థలు దేశంలోనే అత్యుత్తమ విద్యుత్ పంపిణీ సంస్థలుగా నిలిచే సామర్థ్యం కలిగి ఉన్నాయని విశ్వాసం వ్యక్తం చేశారు. టీజీఎస్పీడీసీఎల్ సీఎండీ జితేష్ వి. పాటిల్ మాట్లాడుతూ, విద్యుత్ రంగంపై ప్రజల్లో అవగాహన పెంపొందించడమే ఈ ఎగ్జిబిషన్ ప్రధాన ఉద్దేశమని తెలిపారు. ముఖ్యంగా విద్యార్థులు, పాలిటెక్నిక్, ఐటీఐ విద్యార్థులు, యువ ఇంజినీర్లు విద్యుత్ వ్యవస్థ పనితీరు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, భద్రతా ప్రమాణాలు, వినియోగదారుల సేవల గురించి ప్రత్యక్షంగా తెలుసుకునే అవకాశాన్ని ఈ ప్రదర్శన కల్పిస్తుందని చెప్పారు. ఇళ్లలో, పరిశ్రమల్లో, వ్యవసాయ రంగంలో వినియోగించే విద్యుత్ వెనుక ఉన్న సాంకేతిక వ్యవస్థ, ఉద్యోగుల కృషి, అత్యవసర పరిస్థితుల్లో చేపట్టే చర్యలపై ప్రజలకు అవగాహన కల్పించడం ద్వారా విద్యుత్ భద్రతపై చైతన్యం పెంపొందించడంలో ఈ ఎగ్జిబిషన్ కీలక పాత్ర పోషించనుందని పేర్కొన్నారు.

# జిల్లా ఆసుపత్రులను సూపర్ వైద్య కేంద్రాలుగా తీర్చిదిద్దాలి

- **- మేజర్ శస్త్రచికిత్సలు చేసే స్థాయికి అభివృద్ధి**
- **- అవసరం లేకుండా రోగులను రిఫర్ చేయొద్దని ఆదేశం**
- **- కొత్త సీటీ స్కాన్లు, పరికరాల ఏర్పాటుకు చర్యలు**
- **- నిర్లక్ష్యంపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరిక**
- **- మంత్రి దామోదర రాజనర్సింహ**

**హైదరాబాద్, ఆగస్టు 22 (తెలంగాణ ముచ్చట్లు):**



రాష్ట్రంలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, ఏరియా ఆసుపత్రులు, జిల్లా ఆసుపత్రులను మేజర్ శస్త్రచికిత్సలు కూడా నిర్వహించగల పూర్తిస్థాయి వైద్య కేంద్రాలుగా అభివృద్ధి చేయాలని రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అధికారులను ఆదేశించారు. ప్రజలకు తమ ప్రాంతాల్లోనే నాణ్యమైన వైద్య సేవలు అందుబాటులో ఉండేలా జిల్లా, ఏరియా ఆసుపత్రుల సామర్థ్యాన్ని మరింత పెంచాలని సూచించారు. హైదరాబాద్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ కార్యాలయంలో డైరెక్టరేట్ ఆఫ్ సెకండరీ హెల్త్ కేర్ పరిధిలోని ప్రభుత్వ ఆసుపత్రుల పనితీరుపై నిర్వహించిన సమీక్ష సమావేశంలో మంత్రి ఈ మేరకు కీలక సూచనలు చేశారు. టీచింగ్ ఆసుపత్రులతో సమానంగా జిల్లా, ఏరియా ఆసుపత్రులు కూడా ప్రజలకు మెరుగైన సేవలు అందించే స్థాయికి చేరుకోవాలని మంత్రి అన్నారు. ఇటీవల టీచింగ్ ఆసుపత్రుల్లో 607 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులు భర్తీ చేసినట్లు గుర్తుచేసిన ఆయన, జిల్లా ఆసుపత్రులు, ఏరియా ఆసుపత్రులు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లలో 1,616 మంది స్పెషలిస్ట్ వైద్యులను నియమించినట్లు తెలిపారు. వైద్యులు, సిబ్బందితో పాటు అవసరమైన మౌలిక సదుపాయాలు, ఆధునిక వైద్య పరికరాలు కూడా అందుబాటులోకి తీసుకొస్తున్నామని చెప్పారు.

చిన్నచిన్న సమస్యలకు కూడా రోగులను పెద్ద ఆసుపత్రులకు రిఫర్ చేయడం వల్ల ప్రజలకు అనవసర ఇబ్బందులు ఎదురవుతున్నాయని మంత్రి ఆవేదన వ్యక్తం చేశారు. స్థానికంగా చికిత్స అందించే అవకాశం ఉన్నప్పటికీ రోగులను పైస్థాయి ఆసుపత్రులకు పంపడం వల్ల వారి కుటుంబాలపై ఆర్థిక భారం పడుతోందని పేర్కొన్నారు. అత్యవసర పరిస్థితుల్లో మాత్రమే రిఫర్ చేయాలని, అలాంటి సందర్భాల్లో కూడా ముందుగానే సంబంధిత ఆసుపత్రులతో సమన్వయం చేసుకోవాలని ఆదేశించారు. రోగులకు స్థానికంగానే మెరుగైన సేవలు అందించడంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్య సేవల నాణ్యత పెంచేందుకు అవసరమైన చోట కొత్త సీటీ స్కాన్లు, డయాగ్నస్టిక్ పరికరాలు, ఇతర ఆధునిక వైద్య సౌకర్యాలు ఏర్పాటు చేయాలని మంత్రి ఆదేశించారు. పరికరాల కోసం ప్రతిపాదనలు పంపేటప్పుడు రోగుల సంఖ్య, అవసరాలు, వినియోగ సామర్థ్యం వంటి అంశాలను స్పష్టంగా వివరించాలని చెప్పారు. కేవలం డిమాండ్ ఆధారంగా కాకుండా శాస్త్రీయ విశ్లేషణతో ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. ప్రతి ఆసుపత్రిలో అందుబాటులో ఉన్న వనరులను పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని పేర్కొన్నారు.

డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్లు వారానికి కనీసం ఒకరోజు ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలని మంత్రి ఆదేశించారు. వైద్యులు, సిబ్బంది సమయానికి విధులకు హాజరవుతున్నారా, రోగులకు సరైన చికిత్స అందుతోందా, పరికరాలు పనిచేస్తున్నాయా, మందుల కొరత ఉందా వంటి అంశాలను ప్రత్యక్షంగా పరిశీలించాలని సూచించారు. పరిశుభ్రత, తాగునీటి సరఫరా, బయోమెడికల్ వ్యర్థాల నిర్వహణపై కూడా ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు. ప్రతి నెల తమ తనిఖీల నివేదికను ప్రభుత్వానికి సమర్పించాలని స్పష్టం చేశారు. విధులకు గైర్హాజరు కావడం, ముందుగానే ఆసుపత్రి నుంచి వెళ్లిపోవడం, విధుల్లో నిర్లక్ష్యం ప్రదర్శించడం వంటి చర్యలను ప్రభుత్వం ఏమాత్రం సహించదని మంత్రి హెచ్చరించారు. ప్రజల ఆరోగ్యానికి సంబంధించిన అంశాల్లో జవాబుదారీతనం అత్యంత ముఖ్యమని పేర్కొన్నారు. ఆసుపత్రుల్లో తలెత్తే సమస్యలను ముందుగానే గుర్తించి వెంటనే పరిష్కరించాలని, స్థానికంగా పరిష్కరించగల సమస్యలను పెండింగ్‌లో ఉంచవద్దని ఆదేశించారు. ప్రభుత్వ ఆసుపత్రులపై ప్రజల విశ్వాసాన్ని మరింత పెంచే దిశగా ప్రతి అధికారి, ప్రతి వైద్య సిబ్బంది అంకిత భావంతో పనిచేయాలని మంత్రి దామోదర రాజనర్సింహ పిలుపునిచ్చారు.




# ఉద్యోగుల హక్కుల కోసం పోరాటం

- **2ప్రభుత్వ హామీలపై బీఆర్ఎస్ విమర్శలు**
- **ఈహెచ్ఎస్, వేతనాల అంశాల ప్రస్తావన**
- **సీపీఎస్ రద్దు చేయాలని డిమాండ్**
- **తెలంగాణ భవన్‌లో శ్రీనివాస్ గౌడ్ వ్యాఖ్యలు**

**హైదరాబాద్, ఆగస్టు 22 (తెలంగాణ ముచ్చట్లు):**

రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఉద్యోగులకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని మాజీ మంత్రి వి. శ్రీనివాస్ గౌడ్ ఆరోపించారు. తెలంగాణ భవన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, లక్షలాది మంది ఉద్యోగులు కాంగ్రెస్ పార్టీ హామీలను నమ్మి ఆ పార్టీ అధికారంలోకి రావడానికి కృషి చేశారని పేర్కొన్నారు. ఉద్యోగులను వేధించినా, ఇబ్బందులకు గురిచేసినా బీఆర్ఎస్ పార్టీ మౌనంగా ఉండదని స్పష్టం చేశారు. తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో ఉద్యోగుల పాత్ర అత్యంత కీలకమైందని శ్రీనివాస్ గౌడ్ గుర్తు చేశారు. ప్రత్యేక రాష్ట్రం కోసం ఉద్యోగులు ముందుండి పోరాడారని, వారి త్యాగాలను మరువరాదన్నారు. ఉద్యోగుల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం చిత్తశుద్ధితో వ్యవహరించాలని సూచించారు. తెలంగాణ ఏర్పాటుకు ఉద్యోగులు చేసిన కృషిని దేశ నాయకులు కూడా ప్రశంసించారని పేర్కొన్నారు.

ఉద్యోగుల ఆరోగ్య పథకం అమలులో తీవ్ర లోపాలు ఉన్నాయని ఆయన ఆరోపించారు. ఉద్యోగుల నుంచి ఆరోగ్య పథకం కోసం నిధులు వసూలు చేస్తున్నప్పటికీ ఆసుపత్రుల్లో సేవలు అందడం లేదని విమర్శించారు. ఈ పరిస్థితుల వల్ల ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. పెండింగ్‌లో ఉన్న వేతన సవరణలు, కరవు భత్యాల అంశాలను కూడా ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగులకు ఇచ్చిన హామీలు అమలు కాలేదని ఆయన విమర్శించారు. ప్రత్యేక సంస్థ ఏర్పాటు చేస్తామని ప్రకటించినప్పటికీ ఇప్పటివరకు చర్యలు తీసుకోలేదన్నారు. కాంట్రాక్ట్ ఉద్యోగులకు సంబంధించిన నిధుల వినియోగంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయని, దీనిపై సమగ్ర విచారణ జరగాలని కోరారు. సమాన పనికి సమాన వేతనం అనే హామీ కూడా క్షేత్రస్థాయిలో అమలు కావడం లేదని ఆరోపించారు.

ఈ సమావేశంలో జి. దేవి ప్రసాద్, సుమిత్రా నంద్, మామిళ్ల రాజేందర్, భుజంగరావు తదితరులు పాల్గొన్నారు. కాగా, సమావేశంలో చేసిన ఆరోపణలు బీఆర్ఎస్ పార్టీ అభిప్రాయాలని, వాటిపై ప్రభుత్వ స్పందన వెలువడాల్సి ఉందని రాజకీయ వర్గాలు పేర్కొంటున్నాయి.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక



# రాజా బహదూర్ విగ్రహావిష్కరణ ఘనంగా

- విద్యాభివృద్ధికి వెంకట్రామారెడ్డి సేవల ప్రశంస
- పేద విద్యార్థులకు అండగా నిలవాలని పిలుపు
- హాస్టల్, పాఠశాల ఏర్పాటుకు సహకారం
- మాజీ మంత్రి హరీశ్‌రావు

**సిద్దిపేట, ఆగస్టు 22 (తెలంగాణ ముచ్చట్లు):**

సిద్దిపేటలోని రెడ్డి సంక్షేమ భవన్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన రాజా బహదూర్ కొత్వాల్ వెంకట్రామారెడ్డి విగ్రహాన్ని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఉపనేత హరీశ్‌రావు, మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డితో కలిసి ఆవిష్కరించారు. రాజా బహదూర్ వెంకట్రామారెడ్డి 157వ జయంతి సందర్భంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో సంఘ ప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ, ఒక వ్యక్తి తాను మాత్రమే అభివృద్ధి చెందడం కంటే తనతో పాటు మరికొందరిని ముందుకు తీసుకెళ్లడమే నిజమైన గొప్పతనమని అన్నారు. ఆ విలువలను ఆచరణలో చూపించిన మహనీయుల్లో రాజా బహదూర్ వెంకట్రామారెడ్డి ఒకరని పేర్కొన్నారు. ఆయన జీవితం నేటి యువతకు స్ఫూర్తిదాయకమని చెప్పారు.

హైదరాబాద్ కొత్వాల్‌గా పనిచేసిన కాలంలోనే విద్య ప్రాముఖ్యతను గుర్తించి విద్యార్థుల కోసం, ముఖ్యంగా బాలికల విద్యాభివృద్ధి కోసం రెడ్డి హాస్టల్ ఏర్పాటు చేసిన దూరదృష్టి కలిగిన నాయకుడని కొనియాడారు. ఆ హాస్టల్ ద్వారా వేలాది మంది విద్యార్థులు ఉన్నత స్థాయికి చేరుకున్నారని, సమాజానికి సేవలందిస్తున్నారని గుర్తు చేశారు. సిద్దిపేటలో కూడా రెడ్డి సంఘం ఆధ్వర్యంలో హాస్టల్ లేదా విద్యాసంస్థ నిర్మాణానికి ప్రతిపాదనలు వచ్చినట్లు హరీశ్‌రావు తెలిపారు. సంఘ నాయకులు చర్చించి అవసరాన్ని నిర్ణయిస్తే దాన్ని ముందుకు తీసుకెళ్లేందుకు పూర్తి సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. విద్యాభివృద్ధి కోసం చేపట్టే ప్రతి కార్యక్రమానికి తన మద్దతు ఉంటుందని స్పష్టం చేశారు.

రెడ్డి సంక్షేమ భవన్ నిర్మాణ చరిత్రను గుర్తు చేసిన హరీశ్‌రావు, ప్రభుత్వంలోకి రాకముందే ఈ భవన నిర్మాణం ప్రారంభించినట్లు చెప్పారు. అనంతరం వివిధ సామాజిక వర్గాలకు కూడా ఫంక్షన్ హాళ్ల నిర్మాణం చేపట్టినట్లు పేర్కొన్నారు. సమాజంలోని అన్ని వర్గాలకు సమాన అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినట్లు వివరించారు. ఫంక్షన్ హాల్ ద్వారా వచ్చే ఆదాయాన్ని విద్య కోసం వినియోగించాలని నూతన కమిటీకి సూచించారు. ఆ నిధుల్లో సగభాగం రెడ్డి సామాజిక వర్గంలోని పేద విద్యార్థులకు, మిగతా సగభాగం ఇతర వర్గాల పేద విద్యార్థులకు కేటాయించాలని కోరారు. వైద్య, ఇంజినీరింగ్ వంటి ఉన్నత విద్యా కోర్సుల్లో ప్రవేశం పొందిన పేద విద్యార్థులకు ఆర్థిక సహాయం అందిస్తే ఒక కుటుంబం మాత్రమే కాదు, ఒక తరం అభివృద్ధి చెందుతుందని హరీశ్‌రావు అన్నారు.

# నేటి నుంచే కొత్త ఈహెచ్‌ఎస్ అమలు

- ఉద్యోగులు, పెన్షనర్లకు ఆరోగ్య భద్రత
- కార్పొరేట్ ఆసుపత్రులతో ఏకాభిప్రాయం
- నగదు రహిత వైద్య సేవలకు శ్రీకారం
- రాష్ట్రవ్యాప్తంగా లబ్ధిదారులకు ఊరట

**హైదరాబాద్, ఆగస్టు 22 (తెలంగాణ ముచ్చట్లు):**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లు, వారి ఆధారిత కుటుంబ సభ్యుల ఆరోగ్య భద్రతను మరింత బలోపేతం చేసే దిశగా ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఉద్యోగుల ఆరోగ్య పథకం (ఈహెచ్‌ఎస్)ను నూతన విధానాలతో శనివారం నుంచి అధికారికంగా అమల్లోకి తీసుకువచ్చింది. దీంతో రాష్ట్రవ్యాప్తంగా లక్షలాది మంది ఉద్యోగులు, పెన్షనర్లు మెరుగైన వైద్య సేవలను నగదు రహిత పద్ధతిలో పొందే అవకాశాన్ని సొంతం చేసుకున్నారు. ఉద్యోగుల సంక్షేమాన్ని ప్రధాన లక్ష్యంగా పెట్టుకుని రూపొందించిన ఈ కొత్త పథకం ఆరోగ్య రంగంలో మరో ముఖ్యమైన మైలురాయిగా నిలవనుంది.

తెలంగాణ సచివాలయంలో ట్రస్ట్ బోర్డు కన్వీనర్, ఎంప్లాయీ హెల్త్ కేర్ ట్రస్ట్ ప్రధాన కార్యనిర్వాహక అధికారి అధ్యక్షతన జరిగిన ఉన్నతస్థాయి సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. సమావేశానికి టీజీజేఏసీ చైర్మన్ మారం జగదీశ్వర్‌తో పాటు ఉద్యోగుల ఆరోగ్య పథకం ట్రస్టు బోర్డు సభ్యులు హాజరయ్యారు. తెలంగాణ స్టేట్ హాస్పిటల్స్ అసోసియేషన్ ప్రతినిధులు, అపోలో, కాంటినెంటల్, యశోద, కిమ్స్ వంటి ప్రముఖ కార్పొరేట్ ఆసుపత్రుల ప్రతినిధులు కూడా సమావేశంలో పాల్గొని పథకం అమలుపై సుదీర్ఘంగా చర్చించారు.

సమావేశం అనంతరం తెలంగాణ స్టేట్ హాస్పిటల్స్ అసోసియేషన్‌తో పాటు కార్పొరేట్ ఆసుపత్రుల యాజమాన్యాలు కొత్త ఈహెచ్‌ఎస్ పథకాన్ని తక్షణమే అమలు చేయాలని ఏకగ్రీవంగా అంగీకరించాయి. ఈ నిర్ణయంతో అర్హులైన ఉద్యోగులు, పెన్షనర్లు మరియు వారి కుటుంబ సభ్యులకు రాష్ట్రవ్యాప్తంగా ఎంపానెల్ చేసిన ఆసుపత్రుల్లో నగదు రహిత వైద్య సేవలు అందుబాటులోకి వచ్చాయి. వైద్య చికిత్సల కోసం ముందుగా భారీ మొత్తాలు చెల్లించి ఇబ్బందులు పడాల్సిన అవసరం లేకుండా ఈ పథకం ఉపశమనం కలిగించనుంది. కొత్త ఈహెచ్‌ఎస్ మార్గదర్శకాలను కూడా ప్రభుత్వం విడుదల చేసింది. ఆసుపత్రుల ఎంపానెల్‌మెంట్ విధానం, చికిత్స ప్రోటోకాల్స్, క్లెయిమ్‌ల పరిష్కార ప్రక్రియ, రోగుల సేవలకు సంబంధించిన నూతన నిబంధనలను ఇందులో స్పష్టంగా పేర్కొన్నారు. చికిత్స పొందే ప్రతి లబ్ధిదారునికి సకాలంలో సేవలు అందేలా, క్లెయిమ్‌ల పరిష్కారం వేగవంతంగా జరిగేలా వ్యవస్థను మరింత పారదర్శకంగా రూపొందించినట్లు అధికారులు వెల్లడించారు.

ఈ కొత్త పథకానికి కార్పొరేట్ ఆసుపత్రుల నుంచి లభించిన సహకారంపై ఎంప్లాయీ హెల్త్ కేర్ ట్రస్ట్ అధికారులు హర్షం వ్యక్తం చేశారు. ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లు ఎలాంటి ఇబ్బందులు లేకుండా నాణ్యమైన వైద్య సేవలు పొందేందుకు ఆసుపత్రుల యాజమాన్యాలు ముందుకు రావడం సానుకూల పరిణామమని పేర్కొన్నారు. రాష్ట్రంలోని ప్రతి లబ్ధిదారుడికి సమర్థవంతమైన వైద్య సేవలు అందించడంలో ఈహెచ్‌ఎస్ కీలక పాత్ర పోషిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కొత్త ఈహెచ్‌ఎస్ పథకాన్ని అక్షరాలా అమలు చేసి లబ్ధిదారులకు పూర్తి స్థాయిలో సేవలు అందించాలని ఎంపానెల్ చేసిన అన్ని ఆసుపత్రులకు ట్రస్ట్ విజ్ఞప్తి చేసింది. ఆరోగ్య సేవల విషయంలో ఉద్యోగులు, పెన్షనర్లు ఎదుర్కొంటున్న సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపడమే ఈ పథకం ప్రధాన ఉద్దేశమని అధికారులు తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ విధానాల్లో ఆరోగ్య రంగానికి అత్యంత ప్రాధాన్యం ఇస్తున్న నేపథ్యంలో ఈ కొత్త ఈహెచ్‌ఎస్ పథకం లక్షలాది కుటుంబాలకు మరింత భరోసా కల్పించనుంది.

# పెద్ద తండా రహదారికి మంత్రి శంకుస్థాపన

- రూ.2.05 కోట్లతో బీటీ రోడ్డు నిర్మాణం
- అభివృద్ధి పనులపై పొన్నం సమీక్ష
- గ్రామ సమస్యల పరిష్కారానికి చర్యలు
- సాగునీరు అందిస్తామని హామీ

**సిద్దిపేట, ఆగస్టు 22 (తెలంగాణ ముచ్చట్లు):**

సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ నియోజకవర్గం అక్కన్నపేట మండలం పెద్ద తండా అభివృద్ధికి కీలకమైన రహదారి పనులకు రాష్ట్ర రవాణా, వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ శంకుస్థాపన చేశారు. రూ.2.05 కోట్ల వ్యయంతో నిర్మించనున్న పెద్ద తండా-అవ్వకుంట బీటీ రోడ్డు పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలతో కలిసి అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. గ్రామంలో రూ.20 లక్షలతో పూర్తిచేసిన అంతర్గత సీసీ రోడ్లను కూడా మంత్రి ప్రారంభించారు. రవాణా సౌకర్యాల మెరుగుదలతో గ్రామ ప్రజలకు ప్రయాణ సౌలభ్యం పెరుగుతుందని పేర్కొన్నారు.



గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని తెలిపారు.

'పల్లె పల్లెకు పొన్నం అన్న - పల్లె పల్లెలో ప్రజా పాలన' కార్యక్రమంలో భాగంగా గ్రామ ప్రజల సమస్యలను మంత్రి నేరుగా అడిగి తెలుసుకున్నారు. అనంతరం సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించి సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజలకు ప్రభుత్వ సేవలు మరింత చేరువ కావాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమం కొనసాగుతున్నట్లు తెలిపారు. గ్రామంలో ఇప్పటివరకు సుమారు రూ.3.50 కోట్ల విలువైన అభివృద్ధి పనులు చేపట్టినట్లు మంత్రి వెల్లడించారు. పెన్షన్లు, ఇందిరమ్మ ఇళ్లు, ఉచిత విద్యుత్, రైతు భరోసా, రేషన్ కార్డులు, స్వయం సహాయక సంఘాలకు రుణాలు వంటి సంక్షేమ పథకాల ద్వారా ప్రజలకు లబ్ధి చేకూరుతోందని వివరించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు.


నీటి సంరక్షణపై గ్రామ ప్రజల్లో అవగాహన పెరగాలని మంత్రి సూచించారు. ప్రతి ఇంటి వద్ద ఇంకుడు గుంతలు నిర్మించుకోవాలని, భూగర్భ జలాల పరిరక్షణకు సహకరించాలని కోరారు. రైతులు సంప్రదాయ పంటలతో పాటు ఆయిల్‌పామ్ సాగుపై దృష్టి సారిస్తే మెరుగైన ఆదాయం పొందే అవకాశం ఉంటుందని సూచించారు. హుస్నాబాద్ నియోజకవర్గంలోని ప్రతి గ్రామానికి సాగునీరు అందించడమే లక్ష్యంగా గౌరవెల్లి ప్రాజెక్టును పూర్తి చేస్తామని మంత్రి హామీ ఇచ్చారు. ప్రజలు ప్రస్తావించిన సమస్యలను అధికారులతో సమన్వయం చేసి పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారమే తమ ప్రధాన లక్ష్యమని, అభివృద్ధి మరియు సంక్షేమ కార్యక్రమాలను గ్రామస్థాయికి తీసుకెళ్లేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు.

# కాంగ్రెస్ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

- మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్

**ఖమ్మం, ఆగస్టు 22 (తెలంగాణ ముచ్చట్లు):**

ఖమ్మం నియోజకవర్గంలో నిర్వహించిన బీఎల్ఏల ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమం రాజకీయ ఉత్సాహం నడుమ జరిగింది. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్, పార్టీ నేతలు కూరాకుల నాగభూషణం, ఆర్జేసీ కృష్ణ, నాగరాజ్ తదితరులతో కలిసి పలువురు నాయకులు పాల్గొన్నారు. పార్టీ బలోపేతంలో కీలక పాత్ర పోషిస్తున్న బూత్ స్థాయి ఏజెంట్ల సేవలను గుర్తిస్తూ వారిని ఘనంగా సన్మానించారు. పార్టీ కోసం అంకితభావంతో పనిచేస్తున్న కార్యకర్తలను అభినందిస్తూ నాయకులు ప్రత్యేకంగా ప్రశంసించారు. ఈ సందర్భంగా మాట్లాడిన నాయకులు బీఎల్ఏలు పార్టీకి వెన్నెముకలుగా పనిచేస్తున్నారని పేర్కొన్నారు. ఎన్నికల సమయంలోనే కాకుండా ప్రజలతో నిరంతరం సంబంధాలు కొనసాగిస్తూ పార్టీ సిద్ధాంతాలను గ్రామ గ్రామానికీ తీసుకెళ్లడంలో వారి పాత్ర ఎంతో కీలకమని అన్నారు.



పార్టీ బలోపేతానికి క్షేత్రస్థాయిలో మరింత చురుకుగా పనిచేయాలని కార్యకర్తలకు సూచించారు. ప్రజా సమస్యలను గుర్తించి వాటిని పార్టీ దృష్టికి తీసుకురావడంలో బీఎల్ఏలు ముందుండాలని పిలుపునిచ్చారు.

రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వంపై ఈ వేదికగా తీవ్ర విమర్శలు గుప్పించారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో మంత్రుల మధ్య సమన్వయం లేకపోవడం, అంతర్గత విభేదాలు పెరిగిపోవడం వల్ల పాలన దెబ్బతింటోందని ఆరోపించారు. అధికార పార్టీలో నెలకొన్న వర్గపోరు కారణంగా రాష్ట్ర అభివృద్ధి పూర్తిగా పక్కన పడిపోయిందని విమర్శించారు. ప్రభుత్వ నిర్ణయాల్లో స్పష్టత లేకపోవడం, పరస్పర విభేదాలు ప్రజలపై ప్రతికూల ప్రభావం చూపుతున్నాయని పేర్కొన్నారు. తెలంగాణ అభివృద్ధికి బదులుగా కాంగ్రెస్ నాయకులు అంతర్గత రాజకీయాలకే ప్రాధాన్యం ఇస్తున్నారని ఆరోపించారు. ప్రజలకు ఇచ్చిన హామీల అమలులో ప్రభుత్వం విఫలమైందని, సంక్షేమం మరియు అభివృద్ధి కార్యక్రమాల్లో ఆశించిన పురోగతి కనిపించడం లేదని విమర్శించారు. రాష్ట్ర ప్రయోజనాల కంటే వ్యక్తిగత, వర్గ రాజకీయాలకు ప్రాధాన్యం ఇవ్వడం వల్ల తెలంగాణ నష్టపోతోందని అన్నారు. ఈ వైఫల్యాలను ప్రజలకు వివరించి అవగాహన కల్పించాలని పార్టీ కార్యకర్తలకు సూచించారు.

బీఆర్ఎస్ పార్టీ ఆశయాలను ప్రజల్లోకి మరింత బలంగా తీసుకెళ్లాల్సిన అవసరం ఉందని నాయకులు పేర్కొన్నారు. తెలంగాణ ఉద్యమ స్ఫూర్తిని కొనసాగిస్తూ కేసీఆర్ చూపిన అభివృద్ధి దిశను ప్రజలకు గుర్తు చేయాలని అన్నారు. రాష్ట్ర హక్కుల పరిరక్షణ, రైతు సంక్షేమం, సామాజిక న్యాయం వంటి అంశాలపై పార్టీ కట్టుబాట్లను వివరించాలని సూచించారు. ప్రతి కార్యకర్త ప్రజల మధ్య ఉండి పార్టీ సందేశాన్ని విస్తృతంగా ప్రచారం చేయాలని పిలుపునిచ్చారు. కేసీఆర్ ఆశయాల సాధన కోసం ప్రతి కార్యకర్త ఒక సైనికుడిలా పనిచేయాలని నాయకులు పిలుపునిచ్చారు. రానున్న రోజుల్లో పార్టీ కార్యక్రమాలను మరింత విస్తృతంగా నిర్వహిస్తూ ప్రజల మద్దతు కూడగట్టాలని సూచించారు. క్షేత్రస్థాయిలో పార్టీ నిర్మాణాన్ని మరింత బలోపేతం చేసి తెలంగాణ ప్రజల సమస్యలపై పోరాటాన్ని కొనసాగిస్తామని స్పష్టం చేశారు. బీఎల్ఏల సేవలను కొనియాడుతూ, వారి కృషితో పార్టీ మరింత బలపడుతుందనే ఆశాభావాన్ని వ్యక్తం చేశారు.

# ఇంపీరియల్ కాలేజీతో తెలంగాణ చర్చలు



- లండన్‌లో రామకృష్ణారావు కీలక భేటీ
- విద్యా, పరిశోధన భాగస్వామ్యంపై దృష్టి
- విద్యార్థుల మార్పిడి కార్యక్రమాల ప్రతిపాదన
- ఇన్వెస్ట్ తెలంగాణ సదస్సుకు ఆహ్వానం

**లండన్, ఆగస్టు 22 (తెలంగాణ ముచ్చట్లు):**

ప్రపంచ ప్రఖ్యాత విద్యాసంస్థలలో ఒకటైన ఇంపీరియల్ కాలేజీ లండన్‌ను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ముఖ్యమంత్రి సలహాదారు, ఎక్స్‌అఫీషియో ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు సందర్శించారు. ఈ సందర్భంగా ఇంపీరియల్ కాలేజీ ప్రతినిధులతో సమావేశమై తెలంగాణలో విద్య, పరిశోధన, నైపుణ్యాభివృద్ధి రంగాల్లో ఉన్న అవకాశాలపై విస్తృతంగా చర్చించారు. సమావేశంలో ఇంపీరియల్ కాలేజీ అధ్యక్షుడి చీఫ్ ఆఫ్ స్టాఫ్, వ్యూహాత్మక భాగస్వామ్య విభాగం ఉపాధ్యక్షురాలు అమాండా వోల్తుయిజెన్, దక్షిణాసియా-ఆస్ట్రలేషియా ప్రాంతాల అంతర్జాతీయ సంబంధాల సీనియర్ మేనేజర్ రొసాన్నా గిల్లెస్పీ పాల్గొన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రత్యేకతలు, హైదరాబాద్‌లో వేగంగా అభివృద్ధి చెందుతున్న విద్యా మరియు సాంకేతిక రంగాల గురించి కె. రామకృష్ణారావు వారికి వివరించారు.

తెలంగాణలో స్వల్పకాలిక విద్యా కోర్సులు, కార్యనిర్వాహక విద్యా కార్యక్రమాలను నిర్వహించే అవకాశాలను పరిశీలించేందుకు ఆసక్తి ఉన్నట్లు ఇంపీరియల్ కాలేజీ ప్రతినిధులు వెల్లడించారు. విద్యార్థులు, అధ్యాపకుల పరస్పర మార్పిడి కార్యక్రమాలతో పాటు పరిశోధన రంగంలో భాగస్వామ్య అవకాశాలను కూడా పరిశీలించనున్నట్లు తెలిపారు. దీని వల్ల తెలంగాణ విద్యార్థులకు అంతర్జాతీయ స్థాయి విద్యా అవకాశాలు మరింత విస్తరించే అవకాశం ఉంది. పరిశోధన, ఆవిష్కరణలు, నైపుణ్యాభివృద్ధి రంగాల్లో తెలంగాణతో కలిసి పనిచేయడానికి తాము సానుకూలంగా ఉన్నామని ఇంపీరియల్ కాలేజీ ప్రతినిధులు పేర్కొన్నారు. ముఖ్యంగా విజ్ఞాన శాస్త్రం, సాంకేతిక విజ్ఞానం, ఇంజినీరింగ్, వైద్య విద్య, వ్యాపార విద్య వంటి రంగాల్లో సహకారానికి విస్తృత అవకాశాలు ఉన్నాయని అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా డిసెంబరు 7, 8, 9 తేదీల్లో హైదరాబాద్‌లో నిర్వహించనున్న 'ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్'లో పాల్గొనాలని కె. రామకృష్ణారావు ఇంపీరియల్ కాలేజీ ప్రతినిధులను ఆహ్వానించారు. తెలంగాణలో పెట్టుబడులు, విద్యా భాగస్వామ్యాలు, పరిశోధన అవకాశాలను ప్రత్యక్షంగా పరిశీలించేందుకు ఈ సదస్సు మంచి వేదికగా నిలుస్తుందని వివరించారు. ప్రపంచంలోని అగ్రశ్రేణి విద్యాసంస్థలలో ఒకటిగా గుర్తింపు పొందిన ఇంపీరియల్ కాలేజీతో తెలంగాణ జరుపుతున్న ఈ చర్చలు రాష్ట్ర విద్యా రంగానికి కొత్త అవకాశాలను తెరవనున్నాయి. అంతర్జాతీయ ప్రమాణాల విద్య, పరిశోధన, ఆవిష్కరణల కేంద్రంగా హైదరాబాద్‌ను తీర్చిదిద్దే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యానికి ఈ భాగస్వామ్య ప్రయత్నాలు మరింత బలాన్నిస్తాయని అధికారులు భావిస్తున్నారు.

# యంగ్ ఫిల్మ్ మేకర్స్ ఛాలెంజ్ పోస్టర్ ఆవిష్కరణ

**హైదరాబాద్, ఆగస్టు 22 (తెలంగాణ ముచ్చట్లు):**

బతుకమ్మ పండుగ సందర్భంగా తెలంగాణ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'యంగ్ ఫిల్మ్ మేకర్స్ ఛాలెంజ్-2026 సీజన్-2' పోటీల పోస్టర్‌ను శనివారం ఆవిష్కరించారు. ఎఫ్‌డీసీ చైర్మన్ దిల్ రాజు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎఫ్‌డీసీ ఎండీ జి.ముకుంద రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ క్రియేటివ్ డైరెక్టర్ రాజ్ కొండా, ఎఫ్‌డీసీ ఈడీ కిషోర్ బాబు పాల్గొన్నారు. యువతలోని సృజనాత్మకతను వెలికితీసి సినీ రంగానికి కొత్త ప్రతిభను పరిచయం చేయాలనే లక్ష్యంతో ఈ పోటీలను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

ఈ సందర్భంగా దిల్ రాజు మాట్లాడుతూ తెలంగాణ చరిత్ర, సంస్కృతి, సంప్రదాయాలు, బతుకమ్మ వంటి పండుగలు, జానపద కళారూపాలు, రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాల ఆధారంగా లఘు





చిత్రాలు, పాటల పోటీలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. గత ఏడాది నిర్వహించిన పోటీలకు మంచి స్పందన లభించిందని, ఈసారి మరింత విస్తృత స్థాయిలో పోటీలను నిర్వహిస్తున్నామని చెప్పారు. యువ దర్శకులు, రచయితలు, గాయకులు, కంటెంట్ సృష్టికర్తలకు ఇది మంచి అవకాశమని పేర్కొన్నారు. ఈ ఏడాది పోటీల్లో కొత్త విభాగాలను కూడా ప్రవేశపెట్టారు. జానపద గీతాలు, రాష్ట్ర ప్రభుత్వ పథకాలపై సామాజిక మాధ్యమాల ప్రభావశీలులు రూపొందించే వీడియోలు, వ్యాసాలకు ప్రత్యేక స్థానం కల్పించారు. తెలంగాణ ఆత్మను ప్రతిబింబించే సృజనాత్మక రచనలు, వీడియోలను ప్రోత్సహించడమే ఈ నిర్ణయం వెనుక ఉద్దేశమని నిర్వాహకులు వివరించారు. గ్రామీణ ప్రాంతాల నుంచి కూడా యువ ప్రతిభ ముందుకు రావాలని వారు ఆకాంక్షించారు.

రాష్ట్ర ప్రభుత్వ క్రియేటివ్ డైరెక్టర్ రాజ్ కొండా మాట్లాడుతూ ఈ పోటీలు యువతకు భవిష్యత్తులో సినీ రంగంలో అవకాశాలు కల్పించే వేదికగా నిలుస్తాయని అన్నారు. పోటీలకు పంపే లఘు చిత్రాల నిడివి మూడు నిమిషాలకు మించకూడదని, పాటల నిడివి ఐదు నిమిషాలలోపే ఉండాలని నిర్వాహకులు స్పష్టం చేశారు. ప్రథమ బహుమతిగా రూ.3 లక్షలు, ద్వితీయ బహుమతిగా రూ.2 లక్షలు, తృతీయ బహుమతిగా రూ.1 లక్ష అందజేయనున్నారు. అదనంగా ఐదుగురికి కన్సోలేషన్ బహుమతులుగా రూ.20 వేల చొప్పున ప్రదానం చేస్తారు. విజేతలకు ప్రశంసా పత్రాలు, జ్ఞాపికలు కూడా అందజేస్తారు. తెలంగాణ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ ప్రతిభను రాష్ట్ర, జాతీయ స్థాయిలో చాటుకోవాలని నిర్వాహకులు పిలుపునిచ్చారు.

Printed,Published and Owned by RAJESH BOLLEPAKA,Printed at Amulya Publications and Printers Graphics,H.No:2-19/1,Thatikayala,Dharmasagar,Hanmakonda,506151 and Published at H.No:2-19/1,Thatikayala,Dharmasagar, Hanmakonda,506151.Editor:BOLLEPAKA RAJESH.RNI:TELTEL/2023/88710.Contact:9493669669.Email:telanganamuchatlu.in@gmail.com.Website:www.telanganamuchatlu.in